RNI NO : TEL TEL2023/46567

# అక్షర వేదం

www.aksharavedam.com

ప్రతి అక్షరం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇంచార్జిలు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును.

చీఫ్ ఎడిటర్: పందిల్ల రవీందర్ (9030653934)

ఎడిటర్ : పొన్నం ప్రసాద్ గౌడ్ (9666992524)

కరీంనగర్ సంపుటి : 03 సంచిక - 258 పేజీలు - 08 వెల - 02/- శుక్రవారం 08 ఆగస్టు 2025

# బిసి బిల్లును వెంటనే ఆమోదించండి

## 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఆర్డినెన్స్

**బిసిలపై చిత్తశుద్ధిని నిరూపించుకోండి**

**రాష్ట్రపతిని నేరుగా కలసి విన్నవిస్తాం**

**బిజెపి, బిఆర్ఎస్‌ల కితాబు అవసరం లేదు**


**మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి**



**అక్షర వేదం/న్యూఢిల్లీ,ఆగస్ట్7:** బీసీలపై ప్రేమ ఉంటే బీసీ బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో మీడియాతోమాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ 42శాతం ఇవ్వాలన్నది తమ కమిట్మెంటని అన్నారు. రిజర్వేషన్ సాధనకోసం తాము చేయాల్సింది చేశామని చెప్పారు. కులగణన, రిజర్వేషన్ల సాధనలో మిగతా2లో...

# రాజీ పడే ప్రసక్తే లేదు..

## ట్రంప్‌కు ప్రధాని మోడీ కౌంటర్



**అక్షర వేదం/న్యూఢిల్లీ,ఆగస్ట్7:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అదనపు సుంకాలపై ప్రధాని మోడీ స్పందించారు. రైతుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని, భారత్ రాజీ పడే ప్రసక్తే లేదని మోడీ కౌంటర్ ఇచ్చారు. రష్యా ముడి చమురు కొనుగోలు చేస్తుండటంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై రెండుసార్లు అదనంగా 25 శాతం సుంకాలను విధించిన సంగతి తెలిసిందే.

మిగతా2లో...

# నకిలీ జిఎస్టీ ఇన్‌వాయిస్‌లతో 750 కోట్ల లూటీ

## - మూడు రాష్ట్రాల్లో ఇడి సోదాలు




**అక్షరవేదం/న్యూఢిల్లీ,ఆగస్ట్7:** రూ. 750 కోట్ల విలువైన 'నకిలీ' జీఎస్‌టి ఇన్వా యిస్‌ల జనరేషన్ కేసులో భాగంగా జార్ఖండ్, పశ్చిమబెంగాల్,మహారాష్ట్రల్లో గురువారం ఈడి సోదాలు నిర్వహించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం మిగతా2లో...

# బీహార్‌లో లక్షల ఓట్ల తొలగింపు

**జాబితా చూపడానికి అభ్యంతరం ఎందుకు**

**మరోమారు ఇసి తీరుపై రాహుల్ విమర్శలు**



**అక్షరవేదం/న్యూఢిల్లీ,ఆగస్ట్7:** ఎన్నికల సంఘం తీరుపై మరోసారి కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో ఆయన మాట్లాడారు. ఈవీఎంలతో ఎన్నికల నిర్వహణపై అనుమానం కలుగుతుందన్నారు. అంచనాలకు అందని ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై అధ్యయనం చేశామని.. హర్యానా, మధ్యప్రదేశ్‌లోనూ అంచనాలకు భిన్నంగా ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఉన్న చోట కూడా బీజేపీకి మాత్రమే అనుకూలంగా వస్తున్నాయని చెప్పారు. మిగతా2లో...



# హైదరాబాద్‌లో వర్ష బీభత్సం

**భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయం**

**అప్రమత్తంగా ఉండాలని సిఎం రేవంత్ ఆదేశం**

**అక్షరవేదం/హైదరాబాద్,ఆగస్ట్7:** హైదరాబాద్ నగరంలో పెనుగాలులతో కుండపోత వర్షం బీభత్సం సృష్టించింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, గచ్చిబౌలి, కొండాపూర్, మియాపూర్, హిమాయత్‌నగర్, మిగతా2లో...

# ఆర్టీసీలో ఉద్యోగాల పేరుతో ఎర

## - బ్రోకర్లతో జాగ్రత్త అంటూ సజ్జనార్ హెచ్చరిక

**అక్షరవేదం/హైదరాబాద్,ఆగస్ట్7:** టీజీఎస్ ఆర్టీసీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఉద్యోగార్థుల్ని కొందరు మోసం చేస్తున్నట్లుగా యాజమాన్యం దృష్టికి వచ్చిందని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఇలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఉద్యోగాలు పైరవీలతో రావని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి మేరకు తమ సంస్థలో 3038 పోస్టుల భర్తీకి సంబంధించిన కసరత్తు మొదలైనట్లు-ప్రకటించారు. ఈ పోస్టులకు ప్రభుత్వ నియామక బోర్డుల ద్వారా నోటిఫికేషన్ త్వరలోనే వెలువడనుందన్నారు. ఈ నియామక పక్రియ మెరిట్ ఆధారంగా పారదర్శకంగా జరుగుతుందని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. అడ్డదారుల్లో ఎవరికీ కూడా ఉద్యోగాలు రావు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రలోభాలకు గురిచేసి డబ్బులు వసూలు చేసే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఉద్యోగార్థులకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఆర్టీసీలో ఉద్యోగాల పేరిట ఎవరైనా మిమ్మల్ని సంప్రదిస్తే వెంటనే యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సంస్థ సూచిస్తోందని పేర్కొన్నారు.





# చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం

**చేనేత ఉపాధి మాత్రమే కాదు...వారసత్వ కళ**

**పీపుల్స్ ప్లాజాలో చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన తుమ్మల**

**అక్షరవేదం/హైదరాబాద్,ఆగస్ట్7:** చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని, అదేవిధంగా జియో ట్యాగింగ్ లో కూడా మనమే ముందున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. చేనేత అనేది కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదు అని, భారతీయ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. ఇది తరతరాలుగా వారసత్వంగా అందిన హస్తకళ. ఈ కళను పరిరక్షించడం బాధ్యత మనందరి మీద ఉందన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు, వస్త్రాన్నిచ్చే నేతన్నకు మిగతా2లో...

# రెండున్నరేళ్లలో మళ్లీ అధికారంలోకి బిఆర్ఎస్

**అప్పుడు అందరి లెక్కలు సరిచేస్తాం**

**కాంగ్రెస్ పాలనతో విసుగెత్తిన ప్రజలు**

**మళ్లీ కెసిఆర్ సిఎం కావాలని కోరుకుంటున్నారు**

**పార్టీమారిన ఎమ్మెల్యేల తీరు అధ్వాన్నం**

**తెలంగాణ భవన్‌లో కెటిఆర్ వెల్లడి**



**అక్షరవేదం/హైదరాబాద్,ఆగస్ట్7:** రెండున్నరేళ్లలో బిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు అందరి లెక్కలు సరిచేస్తామని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో పరిగి నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ పాలనలో అందరికీ న్యాయం జరిగింది. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి పరిస్థితి విచిత్రంగా ఉంది. భూములు విలువలు పడిపోయాయి. యూరియా కోసం రైతులు కష్టపడాల్సి వస్తోంది. పదేళ్లలో రేషన్ కార్డులు ఇవ్వలేదని ఐఏఎస్ అధికారులు అబద్ధాలు చెబుతున్నారు. ఐఏఎస్‌లు రాజకీయాలు మాట్లాడటం సరికాదు. రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. కాంగ్రెస్‌పై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఓట్లు ఉన్నప్పుడు కాదు.. నాట్లు- వేసేటప్పుడు రైతుబంధు ఇవ్వాలి. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాక ప్రభుత్వం రైతుబంధు నిలిపివేస్తుంది. ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు పెట్టి బీసీ సబ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టాలి. మిగతా2లో...

# ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక

● ఎన్‌డిఎ పక్షాల భేటీలో చర్చ ● నిర్ణయం మోడీ,నడ్డాలకు అప్పగింత



**అక్షరవేదం/న్యూఢిల్లీ,ఆగస్ట్7:** ఉప రాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక చేసే నిర్ణయాన్ని ప్రధాని నరేంద్ర మోదీతోపాటు-, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ జడ్డాకు దాఖలు పరుస్తున్నట్లు- ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ప్రకటించాయి. గురువారం న్యూఢిల్లీలో పార్లమెంట్ చాంబర్‌లోని జేపీ నడ్డా కార్యాలయంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు చెందిన కీలక నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై వారంతా చర్చించారు. అనంతరం అభ్యర్థి ఎంపిక బాధ్యతను ప్రధాని మోదీతోపాటు- పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు అప్పగిస్తూ.. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మిగతా2లో...

**బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడుతాం**

2లో

# రాజీ పడే ప్రసక్తే లేదు..

(మొదటి పేజీ తరువాయి)

ఈక్రమంలో గురువారం ఢిల్లీలో జరిగిన ఎంఎస్ స్వామినాథన్ శతాబ్ది అంతర్జాతీయ సమావేశంలో ప్రధాని మాట్లాడుతూ.. "మాకు రైతుల ప్రయోజనాలే ముఖ్యం. భారత్ ఎప్పుడూ రైతులు, మత్స్యకారులు, పాడి రైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడదు. సుంకాల పెంపుతో నష్టం జరుగుతుందని నాకు తెలుసు. దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాను. దేశంలోని రైతులు, మత్స్యకారుల కోసం ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొంటాం" అని అన్నారు.

# నకిలీ జిఎస్టీ ఇన్‌వాయిస్‌లతో 750 కోట్ల లూటీ

(మొదటి పేజీ తరువాయి)

కింద మూడు రాష్ట్రాల్లో సుమారు 12కి పైగా ప్రాంతాల్లో దాడులు నిర్వహించినట్లు- అధికారిక వర్గాలు తెలిపాయి. జార్ఖండ్‌లో షెల్ సంస్థలు మరియు అనధికార ఆర్థిక మార్గాల్లో రూ.750 కోట్ల నకిలీ ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ జనరేషన్‌కు సంబంధించిన కేసు ఇది. ఈ కేసుకు సంబంధించిన కీలక సూత్రధారి శివకుమార్ దేవరాను ఈ ఏడాది మేలో అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆయనపై చార్జిషీట్ దాఖలు చేసినట్లు- ఆ వర్గాలు తెలిపాయి. మనీలాండరింగ్‌లో అనేక మంది వ్యక్తులు మరియు సంస్థల ప్రమేయం ఉన్నట్లు- సూచించే విశ్వసనీయ ఆధారాలతో ప్రస్తుతం సోదాలు చేపడుతున్నట్లు- ఆ వర్గాలు వెల్లడించాయి.

# బీహార్‌లో లక్షల ఓట్ల తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

బీహార్‌లో లక్షల మంది ఓట్లను తొలగించారన్నారు. బీహార్‌లో ఓట్ల తొలగింపుపై ఈసీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అయినా ఓటర్ల జాబితా దేశ సంపద అని.. దానిని ఎందుకు చూపించట్లేదని నిలదీశారు. మహారాష్ట్రలో ఐదు నెలల్లోనే 40 లక్షల మంది ఓటర్లు నమోదయ్యారని.. ఐదేళ్లలో నమోదైన వారి కంటే.. ఐదు నెలల్లో నమోదైన ఓటర్లే ఎక్కువగా ఉన్నారని చెప్పారు. మహారాష్ట్రలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య సమయంలో కోటి మంది ఓటర్లు నమోదయ్యారన్నారు. ఆ సమయంలో ఓటర్ల జాబితా ఇచ్చేందుకు ఈసీ నిరాకరించిందని గుర్తుచేశారు. దేశ సంపదను చూపించేందుకు ఎన్నికల సంఘానికి వచ్చిన ఇబ్బందేంటని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. బీహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సర్వేపై తీవ్ర ఆందోళనలు జరుగుతున్నాయి.

# హైదరాబాద్‌లో వర్ష బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

లక్డీకపూల్, నాంపల్లి సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పంజాగుట్ట, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్, మాదపూర్, కొండాపూర్, బయోడైవర్సిటీ-, ఐకియా సెంటర్, ఏఎంబీ, ఇనార్బిల్ మాల్, కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, హైటెక్‌సిటీలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.. వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వచ్చే 2 రోజులపాటు- రాష్ట్రంలో విస్తారమైన వర్షాలు పడే అవకాశం ఉంది. హైదరాబాద్‌తో పాటు- రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రానున్న రెండు రోజులు వర్షాలు ఉంటాయనే సమాచారం ఉన్నందున కలెక్టర్లు జిల్లాల్లోని అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్ లో పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకు భారీ వర్ష సూచన ఉన్నందున అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. జీహెచ్ఎంసీతో పాటు- పోలీస్, ట్రాఫిక్, హైడ్రా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని.. లోతట్టు- ప్రాంతాల్లో తగిన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. సిటీ-లో ప్రజలు అత్యవసరమైతే తప్ప తమ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని.. వర్షాలు, వరదలతో ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కునేందుకు, ఎలాంటి సహాయమైనా అందించేందుకు అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.


# ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక

(మొదటి పేజీ తరువాయి)

ఆ తీర్మానానికి ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ఆమోదించాయి. అలాగే భారత ఉప రాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబర్ 9వ తేదీన జరగనుంది. ఈ నేపథ్యంలో ఆ ముందు రోజు అంటే.. సెప్టెంబర్ 8వ తేదీన ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు సమావేశం కావాలని ఈ భేటీలో నిర్ణయించారు.ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేపీ నడ్డాతోపాటు- ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు చెందిన కీలక నేతలు జేడీ (యూ) నుంచి లలాన్ సింగ్, శివసేన నుంచి శ్రీకాంత్ షిండే. టీ-డీపీ నుంచి లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎల్‌జేపీ నుంచి కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. మరోవైపు ఉప రాష్ట్రపతి పదవికి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. సెప్టెంబర్ 9వ తేదీన ఈ ఎన్నిక నిర్వహించనున్నట్లు- కేంద్రం ఎన్నికల సంఘం గురువారం అంటే ఆగస్ట్ 7వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పదవికి పోటీ- చేసే అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసేందుకు ఆగస్ట్ 21వ తేదీ చివరి తేదీగా ప్రకటించింది. ఇక 22వ తేదీన నామినేషన్ల పరిశీలన, 25వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ గడువు విధించినట్లు- తెలిపింది. సెప్టెంబర్ 9వ తేదీన పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు ఉంటు-ందని ఎన్నికల సంఘం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. జులై 21వ తేదీన జగదీప్ దన్‌ఖడ్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతోనే తాను ఈ పదవికి రాజీనామా చేసినట్లు- ఆయన ప్రకటించారు. అసలు అయితే ఆయన పదవీ కాలం 2027, ఆగస్ట్ వరకు ఉంది. ఈ నేపథ్యంలో ఉప రాష్ట్రపతి పదవికి ఎన్నిక అనివార్యమైంది.

# ఫామ్‌హౌజ్‌లో ఉండడమే ఓ జైలు

## ● కెసిఆర్ అరెస్ట్‌పై రేవంత్ వ్యాఖ్య



**అక్షరవేదం/న్యూఢిల్లీ,ఆగస్ట్7:** కేసీఆర్ అరెస్ట్ వార్తలపై సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే కేసీఆర్ అరెస్ట్ ఊహాగానాలకు తెరదించారు. కేసీఆర్ స్వీయ నియంత్రణలో బందీ అయ్యారని.. కొత్తగా ఆయన్ని జైల్లో పెట్టాల్సి అవసరం లేదని సీఎం రేవంత్ అన్నారు. చర్లపల్లి జైలుకు ఫామ్‌హౌస్‌కు పెద్ద తేడా లేదన్నారు. ఫామ్‌హౌస్‌లో పర్యవేక్షణ ఉంటుంది. జైల్లో పహారా ఉంటుందని చెప్పారు. ఆయన ఓ రకంగా జైల్లో ఉన్నట్లేనని అన్నారు. ప్రజలతో సంబంధాలు లేకుండా కేవలం ఫామ్‌హౌజ్‌కు పరిమితంకావడంతో జైలులాంటి జీవితానికి అలవాటుపడ్డారని అన్నారు. కేసీఆర్‌ను ప్రజలు ఓడించడమే పెద్ద శిక్ష అంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులతో కలిసి సీఎం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్ఆయఖ్యలు చేశారు.

# బిసి బిల్లును వెంటనే ఆమోదించండి

(మొదటి పేజీ తరువాయి)

తమ చిత్త శుద్ధిని ఎవరు శంకించలేరన్నారు. రాష్ట్ర ప్రభుత్వంగా అన్ని విధాల ప్రక్రియ పూర్తి చేశామన్న రేవంత్.. ప్రస్తుతం బీసీల రిజర్వేషన్ అంశం కేంద్రం పరిధిలో ఉందన్నారు. కేంద్రం, బీజేపీ కోర్టులో రిజర్వేషన్ల అంశం ఉందన్నారు. వాళ్లకు నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే బీసీ బిల్లును ఆమోదించాలన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచడం కోసంబీసీలకు న్యాయమైనా వాటా కోసమే తమ పోరాటమని సీఎం రేవంత్ చెప్పారు. జంతర్ మంతర్ వేదికగా తమ వాణిని బలంగా వినిపించామన్నారు. జంతర్ మంతర్ ధర్నాపై బీజేపీ, బీఆర్ఎస్ నేతల విమర్శలు విడ్డూరమన్నారు. తమ కమిట్ మెంట్ కు వాళ్ల సర్టిఫికేట్ అవసరం లేదని వ్యాఖ్యానించారు రేవంత్. ప్రజలను అబద్ధపు మాటలు చెప్పి మభ్యపెట్టబోమని... అది తమ నైజం కాదన్నారు. బీసీలకు రాహుల్ ఇచ్చిన మాటను అమలుచేడమే తమ టార్గెట్ అని తెలిపారు. మోదీ చేతుల్లోనే బీసీ రిజర్వేషన్ నిర్ణయం ఉందన్నారు సీఎం రేవంత్. తమ ఆఖరి పోరాటాన్ని పూర్తిచేశాం.. ఇక బీజేపీ నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్రపతికి రాజకీయాలకు సంబంధం లేదన్నారు రేవంత్. కేంద్రం బిల్లుకు ఆమోదించక పోతే.. స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలా వెళ్లాలో ఆలోచిస్తామని చెప్పారు. గ్రామస్థాయి నుంచి ప్రజల అభీష్టం మేరకే పార్టీ నిర్ణయం తీసుకుంటాం మన్నారు. లోకల్ బాడీ ఎన్నికలను సెప్టెంబర్ 30 లోపు నిర్వహించాలని హైకోర్ట్ చెప్పిందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బిల్లును రాష్ట్రపతి ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం సాయంత్రం వరకు వేచి చూస్తాం. రాష్ట్రపతి స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నాం. ఆమె సమయం ఇవ్వలేదంటే ప్రధాని ఒత్తిడి చేసినట్టు భావించాల్సి ఉంటుంది. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఉన్న మార్గాలన్నింటిని ప్రయత్నించాం. కుదరనప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల్లో స్థానిక ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు మా వద్ద 3 మార్గాలు ఉన్నాయి. 50శాతం సీలింగ్‌పై గత ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని పక్కన పెట్టి జీవో ఇవ్వాలి. జీవో ఇస్తే.. ఎవరైనా కోర్టుకు వెళ్తే స్టే వస్తుంది. కాబట్టి జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లే మొదటి మార్గం సాధ్యం కాదు. ఇప్పుడే స్థానిక ఎన్నికలు పెట్టకుండా ఆపడం రెండో మార్గం. స్థానిక ఎన్నికలు ఆపితే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగుతాయి. కేంద్ర నిధులు రాకుంటే గ్రామాల్లో వ్యవస్థలు కుప్పకూలుతాయి. మూడో మార్గం పార్టీ పరంగా బీసీలకు 42శాతం సీట్లు- ఇవ్వడం. బీసీలకు 42శాతం సీట్లపై ఇతర పార్టీలపైనా ఒత్తిడి తెస్తాం అని సీఎం తెలిపారు. సమయం కూడా తక్కువగా ఉందని అందుకు అనుగుణంగా తమ కార్యాచరణ ఉంటుందని అన్నారు.

# రెండున్నరేళ్లలో మళ్లీ అధికారంలోకి బిఆర్ఎస్

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డికి కేసీఆర్ అంటే భయం పట్టు-కుంది. అందుకే దిల్లీలో కూడా ఆయన్నే విమర్శిస్తున్నారు. భారత రాష్ట్ర సమితి పాలనలో జరిగిన మంచి పనులు కార్యకర్తలు చెప్పలేకపోయారు.. అందుకే ఓడిపోయాం. కేసీఆర్‌ను మళ్లీ సీఎంను చేయడానికి అందరం కలిసికట్టు-గా పనిచేయాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉన్నంత కాలం ఈ గులాబీ కండువా బరాబర్ ఉంటది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీకు మూడు చెరువుల నీళ్లు తాగించి మళ్లొక్కసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందామని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అనవసరంగా గెలిపించామని రైతులు, మహిళలు, నిరుద్యోగులు బాధపడుతున్నారు. మొన్ననే నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్‌కు సంవత్సరికం చేశారు. కొడంగల్‌లో విషయం అర్థమైంది కాబట్టే కాంగ్రెస్ కార్యకర్తలు ఆ పార్టీలో ఉండే ప్రయత్నం చేయట్లేదు. ఎక్కడ కోల్పోయామో అక్కడే వెతుక్కోవాలి. నేల విడిచి సాము చేయొద్దు. గట్టిగా పని చేస్తే మనమే గెలవబోతున్నాం. అప్పుడు అధికారులందరూ మన చుట్టే తిరుగుతారు. పార్టీ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం అని కేటీ-ఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విపరీతమైన కోపం ఉంది. మనకు ఓటేయడానికి ప్రజలు సుముఖంగా ఉన్నారు. అవసరమైతే మనం చేసిన తప్పులను క్షమించండి అని అడగాలి. పద్ధతిగా పని చేయాలి. పోయినా పదేండ్లలో పార్టీని పెద్దగా చూడలేదు. వచ్చేసారి కంటికి రెప్పలా కాపాడుకుంటాం. ఆర్థికంగా బలోపేతం చేస్తాం. పార్టీ నిర్మాణంపై కూడా దృష్టి పెడుతాం. బీఆర్ఎస్ ఉండనే ఉండదు బీజేపీలో పోతదని తలకు మాసినోళ్లు అంటు-న్నరు మనకేం కర్మ పట్టింది. తెలంగాణ ఉన్నంతకాలం ఈ గులాబీ కండువా బరాబర్ ఉంటది. రెండు పార్టీలకు మూడు చెరువుల నీళ్లు తాగించి మళ్లొక్కసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందాం. మన రాష్ట్రాన్ని కాపాడుకుందాం అని గులాబీ సైనికులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇకపోతే పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలకు కేటీఆర్ చురకలంటించారు. ఆ పదిమంది ఎమ్మెల్యేలు విచిత్రంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మన పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు కొంతమంది పార్టీ మారారు. ఇక పార్టీ మారిన తర్వాత.. పార్టీ మారినం అని చెప్పుకోవాలి కదా..! ఏ పార్టీలో ఉన్నావ్ అంటే ఈ పార్టీలో ఉన్నా అని చెప్పుకోవాలి. ఇక ఓ వీడియోలో ఏ పార్టీలో ఉన్నావ్ సర్ అని ఓ విలేకరి అడుగుతుంటే ఏ పార్టీలో ఉండాల్నో ఆ పార్టీలోనే ఉన్నా అంటడు ఓ ఎమ్మెల్యే. మీ పిల్లలకు బయటకు పోయి టైమ్‌కు రాకపోతే.. ఫోన్ చేసి అడిగినప్పుడు యేడా ఉండాల్నో అక్కడే ఉన్నా అంటే వాన్ని దవడ మీదికెళ్లి ఒక్కటి సంపుతవ్. ఇంటికి రాగానే దవడ మీద ఓటి సరుస్తామా..? లేదా..? అని కేటీ-ఆర్ ప్రశ్నించారు. ఇక ఈ 20 నెలలో విచిత్రమైన అనుభవాలు చూస్తున్నాం. కాలే యాదయ్య ఏ పార్టీలో ఉన్నడు అని చిన్న పిల్లగాన్ని అడిగినా కాంగ్రెస్‌లో ఉన్నడు అని చెప్తరు. కానీ స్పీకర్‌కు అర్థమైతలేదు. ఆయన ఏ పార్టీలో ఉన్నడో శోధించి, పరిశోధించి, మళ్లీ ఎం-కై-÷-వరీ పెట్టి చెప్తారట. రేవంత్ రెడ్డి పరిపాలన వచ్చాక అనుభవాలు ఎంత తమాషాగా ఉన్నాయంటే.. పది మంది ఎమ్మెల్యేల పరిస్థితి ఎట్ల తయారైదంటే.. మీరు ఏ పార్టీలో ఉన్నారని అడిగితే.. మేం బీఆర్ఎస్‌లోనే ఉన్నామని సుప్రీంకోర్టులో రాస్తున్నారు. మరి నువ్వు కండువా కప్పుకున్నావ్ కదా అంటే ఇది దేవుని కండువా అని అంటు-న్నరు. అది కాంగ్రెస్ కండువా కాదు అని చెబుతున్నరు. ఇలా 20 నెలలుగా విచిత్రమైన పరిస్థితి నెలకొని ఉంది అని కేటీఆర్ విమర్శించారు.

# చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు- చేసిన చేనేత ప్రదర్శన కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. కొండా లక్ష్మణ్ బాపుజీ చేనేత పురస్కారానికి ఎంపికైన చేనేత కళాకారులకు ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. తెలంగాణ రాష్ట్రం చేనేత రంగంలో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును సంపాదించిందని, గద్వాల, నారాయణపేట, పోచంపల్లి ఇక్కత్, సిద్దిపేట గొల్లభామ, వరంగల్ దర్రిస్, కరీంనగర్ బెడ్‌షీట్లు- వంటి ఉత్పత్తులు అంతర్జాతీయంగా పేరుగాంచాయని పేర్కొన్నారు.చేనేత ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వ శాఖలు టెస్కో ద్వారానే వస్త్రాలను కొనుగోలు చేయాలనే ఆదేశాలు ఇచ్చినట్టు- తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తూ చేనేత కళను కొత్త తరం వరకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా త్రిలింగ పట్టు- చీరలను,లోగోను మంత్రి ఆవిష్కరించారు. చేనేత కార్మికులకు ఏ సమస్య వచ్చిన మా ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రిగారు హామీ ఇచ్చారు. చేనేత దినోత్సవం సందర్భంగా పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు- చేసిన వస్త్ర ఎగ్జిబిషన్ లో 100 పైగా స్టాల్స్ ను మంత్రి ప్రారంభించి, వారు తయారుచేసిన చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. ముఖ్యంగా జైలు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు-చేసిన స్టాల్లోని వస్త్రాలను మంత్రి ప్రత్యేకంగా పరిశీలించి అభినందించారు. అంతేకాకుండా కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత అవార్డులకు ఎన్నికైన వారు తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలించిన ఆయన, వారిని అభినందించారు. ఈ సందర్భంగా జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.. అంతరించిన పోతున్న చేనేత కళలన్నింటికి పునర్వైభవం తెచ్చేలా ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ ప్రభుత్వం చేనేత కార్మికుల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని అన్నారు. అందులో భాగంగా రెండు సంవత్సరాల కాల వ్యవధితో నేతన్న పొదుపు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. మరణించిన చేనేత కుటుంబానికి అండగా ఉండేలా నేతన్నకు భద్రత పథకం ద్వారా మరణించిన కుటుంబ నామినికి 5 లక్షలు అందజేస్తున్నామన్నారు. మార్చి నెలలో ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా చేనేత రుణమాఫీ కోసం 33 కోట్లు- విడుదల చేశామన్నారు. చేనేత కార్మికులకు సంవత్సరానికి 18 వేలు, అనుబంధ కార్మికులకు 6 వేలు వచ్చేలా నేతన్న భరోసా పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఒఒఐ÷ ని ప్రారంభించి, 120 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడం జరిగిందన్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడుతాం

## కిషన్ రెడ్డి లాంటి వారి కుట్రలు సాగనివ్వం

## మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్

**అక్షరవేదం/న్యూఢిల్లీ,ఆగస్ట్7:** బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధేయ పద్ధతిలో పోరాడి అనుకున్నది సాధిస్తామన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా.. గెలిచిందని ఎద్దేవా చేశారు. ఉత్తరాదిలో చాలా రాష్ట్రాల్లోబీసీలు ఆ పార్టీని తిరస్కరించారని చెప్పారు. రిజర్వేషన్లు పెంచకుంటే వచ్చే ఎన్నికల్లో భాజపా ఓటమి ఖాయమని పేర్కొన్నారు. శాసనసభలో బీసీ బిల్లుపై తీర్మానం సందర్భంలో కిషన్‌రెడ్డి దానికి వ్యతిరేకంగా అభిప్రాయం చెప్పిఉంటే ఆరోజే చర్చ జరిగేది. కానీ ఆ బిల్లు చట్టం రూపంలో మారి గవర్నర్ ఆమోదంతో దిల్లీకి వచ్చిన తర్వాత మీరు ముస్లింల పేరుతో ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. వారికి రిజర్వేషన్లు ఇప్పుడే కొత్తగా ఇవ్వడం లేదన్నారు. మిమ్మల్ని బహిరంగ చర్చకు కూడా ఆహ్వానించ దల్చుకున్నా. మా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. కామారెడ్డి డిక్లరేషన్ నుంచి జంతర్ మంతర్ ధర్నా వరకు మేం బాధ్యతగా ఉన్నాం అని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉత్తరాదిలో చాలా రాష్ట్రాల్లో బిసిలు బిజెపిని తిరస్కరించారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వమని అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో బిజెపి చావుతప్పి కన్నులొట్ట అన్నట్లు-గా గెలిచిందని విమర్శించారు. బిసి రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడుతామని సవాల్ విసిరారు. బిసి రిజర్వేషన్లు పెంచపోతే వచ్చే ఎన్నికల్లో బిజెపి ఓటమి ఖాయమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బీసీ కోటాను అడ్డుకునే కిషన్ రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి బీసీలపై మాట్లాడేమాటలు కరెక్ట్ కాదన్నారు. బీసీ కోటా ఇవ్వడం కుదరదని కిషన్ రెడ్డి లేఖ ఇవ్వాలన్నారు. బీసీ కోటాకు బీజేపీ నేతలు అడ్డుపడుతున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉందన్నారు. సమగ్ర కులగణ సర్వేను పకడ్బందీగా నిర్వహించామని చెప్పారు. అశాస్త్రీయమైన సర్వే చేసి, బీసీల సంఖ్యను తగ్గించారని కిషన్ రెడ్డి అన్నారు. ఆ తర్వాత దీనికి 10 శాతం ముస్లింలను చేర్చి.. బీసీలను మోసం చేస్తున్నారని అన్నారు . తెలంగాణ ప్రభుత్వం ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం వల్ల బీసీలకు కేవలం 32 శాతం మాత్రమే రిజర్వేషన్లు అందుతాయని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇది బీసీలను మోసం చేయడమేనని చెప్పారు. ముస్లింలను బీసీల్లో చేర్చడాన్ని బీజేపీ అంగీకరించదన్నారు. ముస్లింలకు రిజర్వేషన్లు తొలగిస్తే, బీసీ రిజర్వేషన్ల బాధ్యతను తాను తీసుకుంటానని అన్నారు కిషన్ రెడ్డి. బీసీ రిజర్వేషన్లపై హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీనే వాటిని అమలు చేయాలని కిషన్‌రెడ్డి అన్నారు. అది కాకుండా బట్టకాల్చి బీజేపీపై వేస్తామంటే ఊరుకోబోమని మండిపడ్డారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ పెట్టుకున్న సభ.. గాంధీ కుటుంబాన్ని పొగడటానికే సరిపోయిందని ఎద్దేవా చేశారు. సీ రిజర్వేషన్లు ఇస్తామని తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ హామీ ఇచ్చింది..దాన్ని పూర్తిచేసుకోవాల్సిన బాధ్యత ఆ పార్టీదే. అందుకోసం న్యాయపరమైన, చట్టపరమైన అంశాలపై దృష్టిసారించి, చిత్తశుద్ధితో పనిచేయాలి తప్ప.. బట్టకాల్చి బీజేపీ మీద వేస్తానంటే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన అన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికలపై భవిష్యత్ కార్యాచరణ

**- ధరూర్ మండలం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించిన ఎన్‌హెచ్‌పిఎస్ జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్**



**అక్షర వేదం/గద్వాల్ ప్రతినిధి ఆగస్ట్ 07:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వస్తున్న నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యాయంలోని జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్ ధరూర్ మండలం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో నిలవడానికి నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు సన్నద్ధం కావాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా నాయకులు రంగస్వామి,ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవిందు, మండలాల ఉపాధ్య క్షులు మునెప్ప, ఆంజనేయులు, నాయకులు మల్దకల్, జగదీష్, వీరేష్, రాము, శివన్న, స్వామి, ఊరబావి రాములు,గోవిందు, జమ్మన్న,రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు




**అక్షర వేదం/మహబూబాబాద్:-ఆగష్టు 7:** పరిగి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు నేడు కేటీఆర్ గారి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరికతెలంగాణ భవన్ లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ....పరిగి నియోజకవర్గం నుండి పాదయాత్ర ప్రారంభించిన కాంగ్రెస్ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర చేసిన ప్రతి గ్రామం నుండి ఇవాళ బీఆర్ఎస్ పార్టీలో జాయిన్ అయిన ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు

# తల్లిపాల వారోత్సవాలు



**అక్షర వేదం/రాయికల్ ఆగస్టు 07:** ఆగస్టు 1వ తేదీ నుండి ఏడవ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా రాయికల్ మండలం ఇటిక్యాల సెక్టర్ లోని ఇటిక్యాల గ్రామంలో అంగన్వాడీ కేంద్రం ఐదవ సెంటర్లో గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు చేయడం జరిగింది.ముందస్తు రాఖీ పండగ సందర్భంగా రాఖీ పండుగ వేడుకలను నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా తల్లిపాల గురించి మరియు ముర్రుపాల గురించి వాటి ప్రాముఖ్యత గూర్చి తల్లులకు వివరించడం జరిగింది. పోషకాహారం గూర్చి సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు గూర్చి మరియు దోమల నివారణ గూర్చి తీసుకునే ముందు జాగ్రత్తలు గూర్చి తెలియజేయడం జరిగింది. గర్భిణీలు బాలింతలు సున్నా నుండి ఐదు సంవత్సరాల పిల్లల తల్లులు అంగన్వాడీ టీచర్లు కుంట సుజాత, మామిడి బుజ్జమ్మ, ఆశా కార్యకర్తలు రమాదేవి, సుమలత తదితరులు పాల్గొన్నారు



# గ్రీన్ వుడ్ టెక్నో స్కూల్‌లో రక్షాబంధన్

**● ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈస్ట్ బోడుప్పల్ యాదవ సంఘం అధ్యక్షుడు కొండ ఐలయ్య**



**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/మేడిపల్లి: బోడుప్పల్,ఆగస్టు 07:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎన్ఐఎన్ కాలనీలో రాఖీ పౌర్ణమి శుభ సందర్భంగా గ్రీన్ వుడ్ టెక్నో స్కూల్ లో ఆర్ ఎస్ ఎస్ ఆద్వర్యంలో ఈస్ట్ బోడుప్పల్ యాదవ సంఘం అధ్యక్షుడు కొండ ఐలయ్య,వంచ రాంరెడ్డి కలిసి రక్షాబంధన్ కార్యక్రమాన్ని విద్యార్థిని,విద్యార్థులతో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వంచ రాంరెడ్డి మాట్లాడుతూ...రాఖీ అంటే రక్షణ అని అర్థం.రక్షా బంధన్ లో రక్ష అంటే రక్షించడం, బంధన్ అంటే సూత్రం అని అర్థం. అందుకే ప్రతి ఒక్క సోదరీమణి తమ సోదరులకు రక్ష సూత్రం(రక్షా బంధన్) కడతారు.తమ సోదరులందరూ ప్రతి ఒక్క పనిలోనూ విజయం సాధించాలని కోరుతూ.. వారు జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని కోరుకుంటూ ఎర్రని దారాన్ని తయారు చేసి చేతికి కడతారు అని పండగ విశిష్టతను తెలియజేశారు.విశిష్టతను విద్యార్థులకు తెలియజేసినందుకు కొండ ఐలయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదాలోపాద్యాయురాలు జి. హరిత,స్వయం సేవకులు రెడ్డిగారి రమేష్ రెడ్డి,శివశంకర్ లు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పించి జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్



**అక్షర వేదం/గద్వాల్ ప్రతినిధి ఆగస్టు 7:** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ హాజరయ్యారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన గొప్ప యోధుడు ప్రొఫెసర్ జయశంకర్ అని అన్నారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఉద్యమ నాయకుడిగానే కాక, తెలంగాణ ఆత్మగౌరవాన్ని పరిరక్షిస్తూ,రాష్ట్ర భవిష్యత్ దిశను సైద్ధాంతికంగా నిర్దేశించిన మహా మేధావి అని విద్యారంగంలో చేసిన కృషి,సమానత్వం,ప్రాంతీయ న్యాయం వంటి అంశాలపై ఆయన చేసిన అధ్యయనాలు ఈ తరం విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ,జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి నుషిత,జిల్లా అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కారం


**● మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం (యం.సి.హెచ్చ్) అధికారి డాక్టర్ సారంగం**




**అక్షర వేదం/మరిపెడ :-ఆగష్టు 7:** డాక్టర్ బి. రవి రాథోడ్ గారి (జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి) ఆదేశానుసారం, తల్లిపాల వారోత్సవాలను ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం పట్టణంలోని పద్మశాలి భవన్ లో మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం (యం.సి.హెచ్చ్) అధికారి డాక్టర్ సారంగం, గవర్నమెంట్ బిఎస్సి నర్సింగ్ కాలేజ్ స్టూడెంట్స్ మరియు యూపీఎస్సీ ప్రాథమిక కేంద్రం వైద్య సిబ్బందితో తల్లిపాల వారోత్సవాలు పాలిచ్చే తల్లులందరికీ, తల్లిపాల ప్రాముఖ్యతను, డాక్టర్ సారంగం వివరిస్తూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కారం అని అమృతం లాంటివని, ప్రసవం కాగానే తల్లిపాలు పట్టించవలసిందిగా తల్లులకు అవగాహన కల్పించారు.తల్లిపాల ప్రాముఖ్యత, మాతృశిశు ఆరోగ్యంపై అవగాహన పెంపు, తల్లిపాలు ఇవ్వడంలో తల్లుల్ని ప్రోత్సహించడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవగాహన సదస్సులు, ఆసుపత్రులలో మాతృశిశు ఆరోగ్య శిబిరాలు ఎ.డబ్ల్యూ.డబ్ల్యూ.మరియు ఎ.న్ .యం ల ద్వారా ఇంటింటి ప్రచారం తల్లులకు పాఠశాలలు, కమ్యూనిటీ సెంటర్లలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, తల్లిపాలు శిశువుకు మొదటి వ్యాక్సిన్ లాంటివి. ఇవి శిశువుని వివిధ వ్యాధుల నుంచి రక్షిస్తాయి. మాతృతత్వాన్ని కలిగి ఉన్న ప్రతి తల్లి తమ బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలి." ఈ కార్యక్రమంలో బీఎస్సీ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ లీలా మాట్లాడుతూ, ప్రసవం, గానే తల్లులు, మురిపాలు పట్టించవలసిందిగా తల్లులకు విజ్ఞప్తి చేశారు.బీఎస్సీ నర్సింగ్ స్టూడెంట్స్, రోల్ ప్లే ద్వారా, చాట్ ద్వారా, నాటిక ద్వారా, తల్లులకు, పాలిచ్చే పద్ధతులు, తల్లిపాల విశిష్టత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి రాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ లోకియా హెచ్ఈఓ, యూపీఎస్సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక, సిహెచ్ఓ శ్రీనివాస్, యుపిఎస్సి వైద్య సిబ్బంది, సూపర్వైజర్ పుష్పలీల, ఆరోగ్య కార్యకర్తలు అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ జ్యుడీషియల్ సభ్యుడిగా వేమిరెడ్డి భాస్కర్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 07 (అక్షర వేదం) :** కేంద్ర ప్రభుత్వం తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది వేమిరెడ్డి భాస్కర్ రెడ్డిని గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్(జిఎస్ టిఎటి) జ్యుడీషియల్ సభ్యుడిగా నియమించింది. ఈ నియామకం, జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను దేశ వ్యాప్తంగా పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ సంకల్పంలో ఒక భాగం. మొత్తం 53 మంది జ్యుడీషియల్ సభ్యులకు ఈ నియామకాలలో ఆమోదం లభించింది. ఇది జీఎస్టీ విధానంలో వివాదాల పరిష్కారానికి ఒక ముఖ్యమైన ముందడుగు. వేమిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో సీనియర్ న్యాయవాదిగా సేవలందిస్తున్నారు. పన్నుల చట్టాలలో ఆయనకు మంచి ప్రావీణ్యం ఉంది. ఇదే అనుభవంతో 1993లో పన్నుల విభాగంలో ప్రత్యేక అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులై, జూన్ 1994 వరకు ఆ పదవిలో కొనసాగారు. తెలంగాణ హైకోర్టు 2022లో ఆయనను సీనియర్ న్యాయవాదిగా గుర్తించింది. బలమైన, సమర్థవంతమైన జీఎస్టీ అప్పిలేట్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా వివాదాల పరిష్కారానికి పట్టే సమయం తగ్గడంతో పాటు, పరోక్ష పన్నుల వ్యవస్థపై నమ్మకం కూడా పెరుగుతుంది. ఒక ప్రత్యేకమైన ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడం ద్వారా, జీఎస్టీకి సంబంధించిన వివాదాలను మరింత వేగంగా, నైపుణ్యంతో, తక్కువ భారం కలిగించే విధంగా పరిష్కరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది త్వరగా కేసుల పరిష్కారానికి, ఉన్నత న్యాయస్థానాలలో కేసుల సంఖ్య తగ్గడానికి, ఒక స్థిరమైన పన్నుల వాతావరణానికి దారితీస్తుంది. వివాదాలు సకాలంలో, నిష్పక్షపాతంగా పరిష్కరించ బడతాయని వ్యాపారులకు నమ్మకం కలిగినప్పుడు, వారు మరింత ఆత్మవిశ్వాసంతో పనిచేయగలుగుతారు. ఇది మొత్తం పన్నుల వ్యవస్థపై నమ్మకాన్ని పెంపొందిస్తుంది.

# బాపూజీ ఆదర్శంగా శ్రమదానం

**● పట్టణ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు భాషిపంగు రవికాంత్**



**అక్షర వేదం/మరిపెడ :- ఆగష్టు 7:** మహాత్మగాంధీ నాడు మురివాడల్లో చెత్తను శుభ్రం చేసి.... పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేశారు.. వారిని ఆదర్శంగా తీసుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గౌరవ శాసనసభ్యుల ఆదేశం మేరకు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ తాజుద్దిన్ ఆధ్యక్షతన రోజుకో వార్డ్ చొప్పున స్వచ్ఛధనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రమాధానం చేస్తున్నామని పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు భాషిపంగు రవికాంత్ తెలిపారు.. ఇప్పటి వరకు 6 వార్డుల్లో శ్రమదానం చేయడం జరిగిందని.. మిగతా 9 వార్డుల్లో రోజుకో వార్డ్ చొప్పున అన్ని వార్డుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని అన్నారు..

# జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన పద్మశాలిలు



**అక్షర వేదం/మంచిర్యాల,ఆగస్టు 7:** మంచిర్యాల జిల్లా కేంద్రంలో 11 వ జాతీయ చేనేత దినోత్సవాన్ని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినారు.ఈ కార్య క్రమాలో హాజీపూర్ మండల్ పడ్తన పెల్లి గ్రామానికి చెందిన చిందం లింగయ్య , అంకం లచ్చయ్య చేనేత కార్మికులకు పూల బోకేలు అందజేసి శాలువతో ఘనంగా సన్మానము చేసినారు.ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడుతు చేనేత అంటేనే చైతన్యం అని అలాంటి చేనేత కార్మికులను ప్రభుత్వాలు ఓట్ల కోసం వాడుకుంటున్నాయి తప్ప వారి సంక్షేమం కోసం ఆలోచించిన దాఖలాలు లేవు అని, చేనేత అంటే వృత్తి కాదు అది మన అస్తిత్వం అని పేర్కొన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం వెయ్యి కోట్ల బడ్జెట్ ను విడుదల చేయాలని , చేనేత పై జి స్ టీ రద్దు చేయాలని , జాతీయ చేనేత బోర్డు ను పునరుద్ధరించలని ప్రభుత్వాలను డిమాండ్ చేసారు .అదే విధంగా పద్మశాలీయులు చేనేత కార్మికులు , రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలి అని మేమెంతో మకాంత వాట కొరకు రాజ్యాధికారంలో వాటకొరకు తెలంగాణ జాతిపిత చేనేత సహకారోద్యమ పితమహుడు కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో పోరాడాలని , రాబోయే సర్పంచ్ , ఎంపీటీసీ , మరియు జడ్పీటీసీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం లో మన పద్మశాలీయుల సత్తా చాటాలని అన్నారు .పోగును వస్త్రంగా మలిచి మనిషి మనాన్ని కాపాడేది చేనేత వృత్తి అని , చేనేత వస్త్రాలనే ధరిద్దాం నేత అన్నలకు అండగా ఉందాం అని పేర్కొన్నారు .ఈ సందర్భంగా చేనేత కార్మికులకు, మిత్రులకు , శ్రేయోభిలాషులకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, పడ్తన పల్లి గ్రామ మాజీ సర్పంచ్ అంకం కృష్ణమూర్తి , పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు అడిచర్ల సాగర్, కె మమత రాణి, సంఘం నాయకులు చెరుకు నారాయణ, చెట్టు పెల్లి లక్ష్మిరాజం , దాసరి మల్లయ్య , చిందం రాజలింగు , తిరుపతి , లచ్చయ్య పాల్గొన్నారు .

అక్షర వేదం
ప్రతి అక్షరం ప్రజల పక్షం | తెలుగు దిన పత్రిక
శుక్రవారం 08 ఆగస్టు 2025

# కోటేశ్వర్ చూపు సజీవం..!



**అక్షరవేదం/గోదావరిఖని: ఆగస్టు7:** గోదావరిఖని ఫైవ్ ఇంక్లైన్ ఏరియాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చేతాల కోటేశ్వర్లు(53) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మృతునికి భార్య ప్రతిభ, కుమారుడు రామ్ విఘ్నేష్ ఉన్నారు. బుధవారం సాయంత్రం జ్వరం, అలసటగా ఉందని ఇంట్లో పడుకున్న కోటేశ్వర్లు రాత్రి 7గంటలు దాటినా నిద్రలేవకపోవడంతో, భార్య కోటేశ్వర్లును నిద్రలేపడానికి ప్రయత్నించగా ఎలాంటి స్పందన లేదు. ఎంత పిలిచినా పలుకకపోవడంతో, హుటాహుటిన హాస్పిటల్ కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. కోటేశ్వర్లు నేత్రాలను దానం చేస్తే ఇద్దరికి చూపు వస్తుందని సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి దేవి లక్ష్మీనరసయ్య చెప్పగా, దగ్గరి మిత్రుల సూచనల మేరకు విషాదంలో కూడా స్పందించిన కుటుంబ సభ్యులు నేత్రదానంకు అంగీకారం తెలిపారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో మృతిని కార్నియాలను సేకరించి హైదరాబాదుకు తరలించారు. నేత్రదాత పార్థివ దేహాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, రామగుండం నగరపాలక సంస్థ మాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ .ముస్తఫా, నారాయణదాసు మారుతి, పెంట రాజేష్ తోపాటు పలు పార్టీలకు చెందిన నాయకులు జే.వీ.రాజు, కోట రవి గౌడ్, ఐ.సత్యం, గాదం నందు, గట్ల రమేష్, తాంద్ర సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

# వికలాంగుల సింహ గర్జనను విజయవంతం చేయాలి

**ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మంతెన చిరంజీవి మాదిగ**



**అక్షరవేదం/కాటారం,ఆగస్టు,07:** వికలాంగుల సింహగర్జనలను విజయవంతం చేయాలని కాటారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మంతెన చిరంజీవి మాదిగ అన్నారు. గురువారం కాటారం మండలంలోని గంగారం గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జ్ దుమ్మ వెంకటేశ్వర మాదిగ ముక్యులుగా హాజరై నారు. వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పాలన పూర్తయిన నేటికీ వృద్ధులకు, వితంతులకు, గీత కార్మికులకు,బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు పెంచుతానన్న పింఛన్లు పెంచకుండా పింఛన్దారుల పట్ల వ్యవహారిస్తున్న తీరును వెంటనే ఆపాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా చేయూత పెన్షన్లను అన్నింటినీ పెంచాలని, ముఖ్యంగా వికలాంగులకు రూ 6000 తీవ్రవైకల్యం కలిగిన వికలాంగులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిరిగానే 15000 రూపాయల పింఛన్లు ఇవ్వాలని దాదాపు వికలాంగులకు సంబంధించి ప్రధానమైన 25 డిమాండ్లను కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలనే అంశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 13 న హైదరాబాద్ కేంద్రంగా జరిగే వికలాంగుల చేయూత పెన్షన్దారుల మహా గర్జన సదస్సును మండలంలో ఉన్న వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. వికలాంగుల భూపాల్ పల్లి జిల్లా అధ్యక్షులు దుర్గం శంకరన్న గంగారం గ్రామ కమిటీ వికలాంగుల అధ్యక్షులు మంతెన రాజశేఖర్ సత్యం లావణ్య సతీష్ కొలువురు సంతోష్ సమ్మక్క ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడిని విధుల్లో నుంచి తొలగించాలి

- డిఈఓ పై చర్య తీసుకుని సస్పెండ్ చేయాలి



**అక్షర వేదం/మల్హర్,ఆగస్టు 07:** మండల కేంద్రమైన తాడిచర్లలో పత్రిక విలేకరుల సమావేశంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలం, పెద్దతూండ్ల గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడుగా, విధులు నిర్వహిస్తున్న పిన్నింటి వేంకటేశ్వర్ రావు గత మూడేళ్ళుగా పాఠశాలకు రాకుండా ప్రయివేటు వ్యాపారాలు చూసుకుంటూ, ప్రభుత్వ సెలవుల్లో మాత్రం వేతనం పొందుతున్న అతన్ని వెంటనే విధుల్లో నుంచి తొలగించి అతనికి కొమ్ము కాస్తున్న జిల్లా డిఈఓను సస్పెండ్ చేయాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ గురువారం ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మాట్లాడారు ప్రభుత్వం చేపట్టిన మ్యాచువల్ ట్రాన్స్ పర్ లో భాగంగా 21, జూన్,2022లో జాయిన్ అయిన వేంకటేశ్వర్ రావు 2024 జూన్ 12 వరకు దాదాపు 28 నెలలుగా లాంగ్ లివ్ పెడుతూ, ఆయన స్థానంలో వేరే ఉపాధ్యాయులను జాయిన్ కాకుండా ఉపాధ్యాయ ఉద్యోగి భర్తీ చేయనివ్వకుండా చదువు విద్యార్థులకు నష్టం చేసిన, ఉపాధ్యాయున్ని చరిత్రను ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ లకు జిల్లా డిఈఓ కు పంపిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఉపాధ్యాయ వృత్తికి మచ్చ తెచ్చే ఇతనివద్ద నుంచి జిల్లా విద్యాధికారి మామూళ్లు తీసికొని చూసిచూడనట్లుగా చేయడం సరికాదన్నారు.అటు ప్రయివేటు వ్యాపారాలు చేసుకుంటూ, ఇటు ప్రభుత్వ ఉద్యోగాన్ని కాపాడుకుంటూ ప్రభుత్వాన్ని మోసం చేస్తూ వస్తున్న ఇతనికి జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు వతాస్తు పలకడంపై జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మంత్రి ఇలాకాలో ఇలాంటి ఉపాధ్యాయులు ఉండడం,అదికూడా మూడేళ్ళుగా విద్యాశాఖ నిద్రమత్తులో జోగడం విస్మయానికి గురిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో యుఐఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు యాదవ్. ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక కో కన్వీనర్ అయితే బాపు. తుడుం దెబ్బ జిల్లా నాయకుడు దయ్యం పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి వార్షిక లాభాలు చెప్పడానికి ఆలస్యం ఎందుకు?: సిఐటియు

- తుమ్మల రాజారెడ్డి రాష్ట్ర అధ్యక్షులు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు



**అక్షరవేదం/గోదావరిఖని: ఆగస్టు7:** గోదావరిఖని ఓసిపి-5 లో గురువారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులను కలిశారు. ఈ సందర్భంగా సిఐటియు అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ, గత ఆర్థిక సంవత్సరం పూర్తి అయి నాలుగు నెలలు గడిచిన ఇప్పటికి యాజమాన్యం సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను చెప్పడానికి మీనమేషాలు లెక్కిస్తుండడంతో కార్మికులందరూ సంస్థ పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రేపు సిఐటియుగా ఆధ్వర్యంలో అన్ని గనులు డిపార్ట్మెంట్లలో వినతి పత్రాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నామని, అన్ని కార్మిక సంఘాలు ఏదో ఒక రూపంలో నిరసనలు ఆందోళనలు చేస్తుంటే యాజమాన్యం మౌనంగా ఉండడం సరికాదన్నారు. కార్మిక సంఘాలు చేసే ఆందోళనలు ధర్నాలు నిరసన వల్ల సంస్థలో పారిశ్రామిక సంబంధాలు దెబ్బ తినే అవకాశం ఉన్నందున యాజమాన్యం వెంటనే సంస్థకు వచ్చిన లాభాలను తెలియజేసి 35శాతం వాటాను ప్రభుత్వం చేత చెల్లించేలా ఒప్పించాలన్నారు. యాజమాన్యం లాభాలు ప్రకటించిన తర్వాత ప్రభుత్వం వాటాను ప్రకటించడం అనవాయతిగా వస్తుందని గత రెండు నెలల క్రితమే సంస్థ చైర్మన్ 5వేల కోట్ల పైచిలుకు లాభాలు వచ్చాయని చెప్పారని, ఆడిట్ పూర్తయినా కూడా ఇప్పటికి లాభాలు ప్రకటించకపోవడం చూస్తుంటే సంస్థ ఆర్థిక పరిస్థితి పై కార్మికులకు అనుమానం వస్తుందని అన్నారు. కోల్ బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి పై ఒత్తిడి తెచ్చి వాటా చెల్లించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తోట నరహరి రావు, ఆర్జీవన్ అధ్యక్షులు ఆరేపల్లి రాజమౌళి, ఉపాధ్యక్షులు ఎస్కే గౌస్, పిట్ సెక్రెటరీ ఈద వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# మిరప నర్సరీలను తనిఖీ చేసిన జిల్లా ఉద్యాన శాఖ అధికారి



**అక్షర వేదం/చిట్యాల, ఆగష్టు07:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని జూకల్ మరియు చల్లగరిగే గ్రామ శివారులలో అనుమతి పొందిన మిరప నర్సరీలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎడ్ల సునీల్ కుమార్ ఈ రోజు సందర్శించారు.మాట్లాడుతూ, జిల్లాలో ఈ సంవత్సరం 10 మిరప నర్సరీలకు లైసెన్సులు రెన్యూవల్ చేసినట్లు తెలిపారు. లైసెన్సుదారులు నర్సరీ చట్టం ప్రకారం విధిగా నిబంధనలు పాటించాలని, నర్సరీ నిర్వహణలో రిజిస్టర్లు తప్పనిసరిగా నిత్యము అప్డేట్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.ముఖ్యంగా నర్సరీలో సస్యరక్షణ చర్యలు,నారు వయసు, అమ్మకాలు మొదలైన వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని, మిరప నారును కేవలం 35 నుంచి 40 రోజుల వరకే పెంచాలనీ, అనంతరం వాటి ఉత్పత్తి వివరాలు నమోదు చేయాలనీ ఆయన సూచించారు.నర్సరీ చట్టం ఉల్లంఘిస్తే నర్సరీలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్సుతో కూడిన నర్సరీలపై పర్యవేక్షణ మరింతగా బలపరచనుందని తెలిపారు.

# పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో విమానాశ్రయం ఏర్పాటు చేయండి

**పారిశ్రామిక, పర్యాటక రంగ అభివృద్ధికి సహకరించండి.**

**కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యేలు రాజ్ ఠాకుర్, విజయ రమణారావు.**



**అక్షరవేదం/గోదావరిఖని: ఆగస్టు7:** పెద్దపల్లి జిల్లా, అంతర్గాం మండలంలో విమానాశ్రయం నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేయాలని కోరుతూ గురువారం న్యూఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిరామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాగూర్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణ రావు కలిసి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ని కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దపల్లి జిల్లా భౌగోళికం, పరిశ్రమలు, జనాభా వృద్ధి, రవాణా అవసరాలు తదితర అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. విమానాశ్రయం ఏర్పాటుతో జిల్లాలో వాణిజ్య, పారిశ్రామిక, పర్యాటక అభివృద్ధికి అనుకూల వాతావరణం ఏర్పడుతుందని ఎమ్మెల్యేలు వివరించారు. కేంద్ర మంత్రి ఈ అంశాన్ని సానుకూలంగా పరిగణించారని, అవసరమైన సాంకేతిక పరిశీలనల అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ చర్యలతో పెద్దపల్లి జిల్లా అభివృద్ధికి మరింత ఊపునిచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రతి ఆదివాసి గూడెంలో ఆకు పచ్చ జెండా ఎగరాలి

**తుడుం దెబ్బ నాయకుల పిలుపు**




**అక్షర వేదం/మహా దేవపూర్, ఆగష్టు 07 :** మహాదేవపూర్ మండలంలోని ప్రతి ఆదివాసి గూడెంలో ఆకుపచ్చని జెండా ఎగర వెయ్యాలి, రాబోయే ఆగస్టు 9 తారీకున జరగబోయే ప్రపంచ ఆదివాసి దినోత్సవ సంబరాలు అంబరాన్ని అంటే విధంగా ఘనంగా జరుపుకోవాలని ఆదివాసి గూడాలలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జరుపుకోవాలని ఆదివాసీలకు పిలుపునివ్వడం జరిగింది. ఆదివాసీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు, పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు, మడే కుమార్ ,జిల్లా అధ్యక్షులు తుడుం దెబ్బ, గురుసింగ బాపు, దూనే సమ్మయ్య, ఆదివాసి యువకులు పాల్గొనడం జరిగింది.

# ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ ఆవిష్కరణ



**అక్షర వేదం/మందమర్రిఆగస్టు 7:** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ ప్రధాన కూడలి లో.. తెలంగాణ విద్యావంతుల వేదిక రథసారథి ,తెలంగాణ సాధించడానికి కృషిచేసిన విద్య కోవిదుడు, ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని చాలా ప్రతిష్టాత్మకంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో.. ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా.. బిఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ,చెన్నూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే.. బాల్క సుమన్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దేశపతి శ్రీనివాస్, డాక్టర్ రాజా రమేష్ లు అదేవిధంగా.. పట్టణానికి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు.

# రెండు రోజుల్లో పట్టాదారు పాస్ బుక్ అందజేత



**అక్షర వేదం/జైపూర్ ఆగస్టు 7:** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో తాసిల్దార్ ఆఫీస్ లో రైతుల భూ సమస్యల దృశ్య ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రూపొందించి. భూసమస్యల పరిష్కారానికి అడుగులు వేస్తున్నా సందర్భం లో జైపూర్ మండల పరిధిలో భుభారతి రెవిన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు భూ సమస్య పరిష్కరించి రెండు రోజుల్లో పట్టాదారు పాస్ బుక్ అందజేసిన జైపూర్ తహసీల్దార్ వనజ రెడ్డి.

# ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ ఆవిష్కరణ







**అక్షర వేదం/మందమర్రి ఆగస్టు 7:** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ ప్రధాన కూడలి లో.. తెలంగాణ విద్యావంతుల వేదిక రథసారథి ,తెలంగాణ సాధించడానికి కృషిచేసిన విద్య కోవిదుడు, ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని చాలా ప్రతిష్టాత్మకంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో.. ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథులు గా.. బిఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ,చెన్నూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే.. బాల్క సుమన్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దేశపతి శ్రీనివాస్, డాక్టర్ రాజా రమేష్ లు అదేవిధంగా.. పట్టణానికి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు.

# బీసీ రిజర్వేషన్లపై కేంద్రం పార్లమెంట్‌లో చర్చించాలి

**బీసీ రిజర్వేషన్లకు నా సంపూర్ణ మద్దతు**

**నూతన రేషన్ కార్డులతో నెరవేరిన పేదల కల**

**గద్వాలలో ప్రభుత్వం భనవం మరియు సబ్ స్టేషన్ల నిర్మాణాలకు సుమారు 42.20 కేటాయింపు**

**గద్వాల శాసనసభ్యులు శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**



**అక్షర వేదం/గద్వాల్ ప్రతినిధి ఆగస్ట్ 07:** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు విలేకరుల సమావేశంలో గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మాణం చేసిన సందర్భంలో నేను కూడా నా సంపూర్ణ మద్దతు తెలుపడం జరిగిందన్నారు. నేడు ఢిల్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఢిల్లీలో ధర్నా కార్యక్రమంలో నిర్వహిస్తున్న లిసీఎం రేవంత్ రెడ్డి మరియు మంత్రులు, ఎమ్మెల్యేలకు నా సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్పందించి కేంద్రం కూడా వెంటనే బీసీల బిల్లుకు మద్దతు తెలిపాలని డిమాండ్ చేశారు. ఎంతో కాలంగా నూతన కార్డులు లేక పేదలు మరియు మధ్యతరగతి ప్రజలు అనేక సంక్షేమ పథకాలకు దూరమయ్యారని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల మంజూరుతో పాటు కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లు కూడా చేర్చి రేషన్ కార్డులు కొత్తవి ఇవ్వడం హర్షించంతగ్గ విషయమన్నారు.అదేవిధంగా పేదల సొంతింటి కల నెరవేర్చడం లో భాగంగా గద్వాల నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరిగిందని, పనులు వేగంగా జరుగుతూ ఇండ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. గద్వాల నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ భవనాలు మరియు సబ్ స్టేషన్లు నిర్మాణాలకు సుమారు 40ఎకరాల 20 గుంట భూమి కేటాయిస్తూ జిఓలు జారీ చేసిందని వివరించారు. ధరూరు మండలంలో గుడెందొడ్డి, పెద్దపాడు గ్రామాల్లో, మల్దకల్ మండలంలో ఉలిగేపల్లి, కుర్తిరావల్ చెరువు, గట్టు మండలంలో తుమ్మలచెరువు, రాయపురం గ్రామాల్లో, కేటి దొడ్డి మండలంలో సోంపురం గ్రామాల్లో మొత్తం 7 విద్యుత్ సబ్ స్టేషన్లు నిర్మాణం కోసం 18.7 కోట్లు రూపాయలు మంజూరు కావడం జరిగిందన్నారు. **వివిధ భవనాల నిర్మాణాల కోసం భూమి కేటాయింపుల వివరాలు** ...విద్యుత్ గోదాముల కోసం,విద్యుత్ పరికరాల సబ్ స్టోర్,10,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం తో 2 గిడ్డంగుల నిర్మాణం కోసం 20.5 కోట్లు రూపాయలు మంజూరు కావడం జరిగినది.మల్దకల్ మండలం సంబంధించిన PACS భవన నిర్మాణం, వరి కొనుగోలు కేంద్రం నిర్మాణం, బీసీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణం కోసం 3 కోట్లు రూపాయలు మంజూరు కావడం జరిగినది.జిల్లా మహిళా సమాఖ్య భవన నిర్మాణం కోసం 5 కోట్లు రూపాయలు మంజూరు కావడం జరిగినది. DTO/RTO/ UO భవన సముదాయం, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ భవన నిర్మాణం కోసం 2 కోట్ల రూపాయల మంజూరు కావడం జరిగింది. 100పడకల ప్రభుత్వ ఆసుపత్రి కోసం 33/11KV సబ్ స్టేషన్ నిర్మాణం 4.5 కోట్లు రూపాయలు మంజూరు కావడం కోసం భూములను కేటాయించారు. ఇందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , ఇంచార్జ్ మంత్రి దామోదర్ రాజనర్సింహ , జిల్లా జూపల్లి కృష్ణారావు , వాకిటి శ్రీహరి ,మంత్రులకు , సంబంధిత మంత్రులకు కృతజ్ఞతలు తెలిపిరు. త్వరలోనే ఆయా కార్యాలయాల నిర్మాణాలను పూర్తి చేసి ప్రజల సౌకర్యార్థము అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, మాజీ కౌన్సిలర్స్ మురళి, మాజీ సర్పంచ్ రఘువర్ధన్ రెడ్డి, నాయకులు గద్వాల తిమ్మప్ప, ప్రభాకర్ గౌడ్,కురుమన్న, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 11వ గనిని పరిశీలించిన హైడ్రో జియోలజిస్ట్





**అక్షరవేదం/గోదావరిఖని: ఆగస్టు7:** రామగుండం1జి.డి.కె 11ఇంక్లైన్ గనిని గురువారం భూగర్భ జల శాఖ పెద్దపల్లి అధికారులు,హైడ్రో జియోలోజిస్ట్ లు సిహెచ్ వేణు, పి సుజాత పరిశీలించారు. జీడీకే 11 గని, పెద్దంపేట షాఫ్ట్ భూగర్భ గనిలో ని భూగర్భ జలాల పరిస్థితులను పరిశీలించారు. ముందుగా గని ఏజెంట్ కార్యాలయంలో గనిలోని వివిధ సీమ్ ల ప్యానెల్ లు, గని ప్లాన్ లను అధికారులు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ అధికారి ఆంజనేయప్రసాద్, ఏజెంట్ శ్రీనివాస్, వసీమ్ అక్రం, పిట్ ఇంజనీర్ రాకేష్ పాల్గొన్నారు.

# వరుణుడికోసం సురయ్యపల్లి గ్రామస్తులు మండూకః ఆట



**అక్షర వేదం/మంథని, ఆగస్టు 07:** మంథని మండలం సురయ్యపల్లి గ్రామంలో వానదేవుడు కరుణించాలని కప్ప తల్లి ఆటలతో ఊరు ఊరంతా సందడి చేసుకున్నారు.ఆకుల కిరణ్ , భీముని స్వామి, ఆరెల్లి కిరణ్ గౌడ్, కర్ణ కృష్ణ మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో జీవనాధారమైనటువంటి పంటలకు సరిపడా వర్షాలు లేకపోవడం వల్ల మా ఊరి ఆనవాయితి ప్రకారం ఈ కప్పతల్లి ఆట ఆడుతున్నామని సురాయపల్లి హనుమాన్ దేవాలయంలో నూట ఎనిమిది బిందెల నీళ్లతో గ్రామదేవతలకు అభిషేకం చేసామని అన్నారు.వానదేవుడు కరుణించి వానలు కురవాలని పాడిపంటలు పండి గ్రామంలో ఉన్న ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఈ కప్ప తల్లి ఆట ఆడ జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమం అనంతరం ఆరెల్లి కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. గ్రామ ప్రజలు, మహిళ సోదరిమణులు, రైతులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎంపీడీవో,తహసిల్దార్ కార్యాలయం, ఫర్టిలైజర్ షాప్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో



**అక్షర వేదం/మరిపెడ :- ఆగష్టు 7:** గురువారం జిల్లా (ఇన్చార్జి) కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎంపీడీవో,తహసిల్దార్, కార్యాలయాలు, ఫర్టిలైజర్ షాప్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధానంగా హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్, రైతులకు సంబంధించి ఎరువుల నాణ్యత, ప్రజలకు సత్వరమైన సేవలు పై ప్రత్యేక దృష్టి పెట్టి పారదర్శకంగా కార్యకలాపాల నిర్వహణకు శ్రీకారం చుట్టిందని అందులో భాగంగానే క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరు వారికి కేటాయించిన విధులను క్రమం తప్పకుండా చిత్తశుద్ధితోపనిచేయాలన్నారు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సబ్ సెంటర్ల వారీగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని అవసరమున్న చోట వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్లకు అందుబాటులో వైద్యులు ఉండాలని, ప్రతి ఒక్కరి ఆరోగ్య నివేదికలు సిద్ధం చేయాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, మాత శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని,రానున్న రోజుల్లో నిర్వహించే నూలు పురుగు దినోత్సవం, బోదకాలు నివారణ కార్యక్రమం మందుల పంపిణీ షెడ్యూల్ ప్రకారం సంబంధిత సిబ్బందితో విజయవంతం చేయాలని ఆదేశించారు, ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది హాజరు, మందుల స్టాక్ వివరాలను తనిఖీ చేశారు,ఎంపీడీవో, తాసిల్దార్ కార్యాలయాల ను తనిఖీ చేసి భూ భారతి పైల నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల ఫైల్లు, పౌరులకు అందే సేవలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని వారికి సూచించిన ప్రకారం సేవలు అందించాలని ఆదేశించారు, మండల కేంద్రం లోని కిషన్ నాయక్ అగ్రి మాల్ సీడ్స్, స్టాక్, తనిఖీ చేశారు,రైతులకు అందుబాటులో విత్తనాలు, ఎరువులు, మందులు, ఫర్టిలైజర్స్ తదితర స్టాకును అందుబాటులో ఉంచాలని నాణ్యమైన విత్తనాలను అందించాలని, రైతు వివరాలు సేకరించి ఆన్లైన్ ద్వారా మాత్రమే ఫర్టిలైజర్స్ ను అమ్మకాలు జరపాలని, సూచించారు, జిల్లాలో డిమాండ్ కనుగుణంగా రైతులకు కావలసిన యూరియా, డిఏపి, తదితర ఫర్టిలైజర్స్ అందుబాటులో ఉన్నాయని రైతుల వివరాల ద్వారా ఇప్పటికే సిద్ధంగా ఉంచడం జరిగిందని అన్నారు, నిత్యం వ్యవసాయ శాఖ అధికారులు విస్తరణ అధికారులు సంబంధిత టాస్క్ ఫోర్స్ సిబ్బంది ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు, కల్తీ ఎరువులు, ఫర్టిలైజర్స్ అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు,సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలను వారిని అడిగి తెలుసుకున్నారు, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా హెల్త్ ఎడ్యుకేషన్ న్యూట్రిషన్ సానిటేషన్ లపై దృష్టి పెట్టినందున, అందుకు అనుగుణంగా వసతి గృహంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని నాణ్యమైన రుచికరమైన వేడి, వేడి ఆహారాన్ని అందించాలని, భోజనం సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు వహిస్తూ భోజనాన్ని వడ్డించాలని సూచించారు,పిల్లలకు షెడ్యూలు ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించి విద్యార్థినిల యొక్క ఆరోగ్య, మానసిక స్థితిగతులను పరిశీలిస్తూ ఉండాలన్నారు,అవసరం ఉన్నచోట మానసిక వైద్య నిపుణుల చేత కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు, ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.



# స్తంభంపల్లి పీకే ప్రాథమిక పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు



**అక్షర వేదం/మహా ముత్తారం, ఆగష్టు 07:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం స్తంభంపల్లి(పీకే) గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులంతా సోదరా భవంతో మెలగాలని స్థానిక పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎమ్ సుల్తాన్ పాషా, ఉపాధ్యాయులు నవీన్, సదర్ లాల్, అంగన్వాడి టీచర్ రేణుక, స్థానిక గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 20 వరకు కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయండి

**● తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ కేసులో జిహెచ్ఎంసికి హైకోర్ట్ గడువు**



**హైదరాబాద్, ఆగస్ట్ 07 (అక్షర వేదం) :** తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ దాఖలు చేసిన కేసును హైకోర్టు న్యాయమూర్తి బి.విజయసేన్ రెడ్డి సమక్షంలో లిస్ట్ చేశారు. ప్రకాష్ ఆర్ట్స్ న్యాయవాది అనిల్ కుమార్ మరియు జిహెచ్ఎంసికి ప్రభుత్వ న్యాయవాది మధుసూధన్ రెడ్డి కోర్టుకు హాజరై, తమ కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయడానికి రెండు వారాల పొడిగింపును కోరారు. అయితే, మిగిలిన ప్రతివాదులు హాజరు కాలేదు. అందుకు న్యాయమూర్తి కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయడానికి 20 ఆగస్టు 2025 వరకు సమయం ఇచ్చారు. నేల స్థాయి నుండి 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో హోర్డింగ్‌లను ఏర్పాటు చేసే హక్కుకు సంబంధించి 209 దీర్ఘకాలంగా నమోదైన ఏజెన్సీలు, 53 పిటిషనర్ ఏజెన్సీలకు న్యాయం కోరుతూ తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ జూలై 9న హైకోర్టును ఆశ్రయించారు.ప్రస్తుతం, జిహెచ్ఎంసికి 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో హోర్డింగ్‌లను నిర్వహించడానికి ఎంపిక చేసిన 3 ఏజెన్సీలను మాత్రమే ఎటువంటి పరిమితులు లేకుండా అనుమతిస్తోంది. ఇది 2020లో జారీ చేయబడిన జిఓ నెం.68 యొక్క స్పష్టమైన ఉల్లంఘన. ఒక సంఘంగా 209 పాత రిజిస్టర్డ్ ఏజెన్సీలు, 53 పిటిషనర్ ఏజెన్సీలతో సహా అన్ని అర్హత కలిగిన ఏజెన్సీలకు 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో హోర్డింగ్‌లను అనుమతించడానికి తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ న్యాయం చేయమని హైకోర్టు ను ఆశ్రయించారు. అందుకు జిహెచ్ఎంసి, ఎంఏ అండ్ యూడి, హెచ్ఎంఆర్ఎల్, హైడ్రా, ఎల్ అండ్ టి, ప్రకాష్ ఆర్ట్స్, ఆర్ఎ.ల్.కే కన్స్ ట్రక్షన్స్(లీడ్ స్పేస్), నవనిర్మాణ్ అసోసియేట్స్ నోటీసులు జారీ చేసింది. కావాలని జిహెచ్ఎంసి ఇంకా తన ప్రతిస్పందనను సిద్ధం చేయలేదని, ఉద్దేశపూర్వకంగా ఈ విషయాన్ని ఆలస్యం చేస్తున్నట్లుగా కనిపిస్తోందని తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ పేర్కొంది.

# రేనే హాస్పటల్ సౌజన్యంతో పీడియాట్రిక్ సేవలు ఆరంభం



**అక్షర వేదం/మంథని,ఆగస్టు7:** మంథని పట్టణంలోని రేనే హాస్పిటల్ లో పిడియట్రిక్ వైద్య సేవలు గురువారం నుండి అందుబాటులోని వచ్చాయని పెద్దపల్లి జిల్లా బిజెపి పార్టీ మాజీ అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి తెలిపారు.ప్రతి మంగళ,గురు రోజుల్లో ఉ:9:00 గం నుండి11:30 వరకు అందుబాటులో ఉంటారని సునీల్ రెడ్డి తెలియజేశారు.మారుమూల ప్రాంతల ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో పిడియట్రిక్ విభాగం అందిస్తున్నామని అన్నారు మన మంథని లోని రేనే హాస్పటల్ లో ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సత్యం బాబు ను తీసుకు రావడం జరిగిందని అన్నారు.రెనే హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు.అనంతరం హాస్పటల్ గోదావరిఖని వైద్యులు డాక్టర్ సత్యం బాబు మాట్లాడుతూ మంథని పరిసర ప్రాంత ప్రజల పిల్లల వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లి అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిసి స్వయంగా తానే మంథనిలోని రేనే హాస్పిటల్ కి ప్రతి మంగళ, గురువారం రోజున వస్తున్నామని తెలిపారు.ఈ హాస్పిటల్ వైద్య సేవలు మంథని చుట్టూ పక్కల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు..

# ఎల్‌హెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షునిగా నవరాం నాయక్ ఎన్నిక

**అక్షర వేదం/మహా ముత్తారం, ఆగస్టు 07:** జయశంకర్ భూపాల పల్లి జిల్లా నంగారాబేరి లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షునిగా మహాముత్తారం మండల కేంద్రానికి చెందిన మాలోత్ నవరాం నాయక్ ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన జాతీయ అధ్యక్షులు వద్య దాస్ రామ్ నాయక్, రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ నాయక్‌లకు కృతజ్ఞతలు తెలియజేశాడు.



# సింగరేణి సీపీఆర్వో ఎస్‌డిఎం సుభానికి జాతీయస్థాయి పురస్కారం

## డాక్టర్ సివిఎన్ - పిఆర్ఎస్ఐ జాతీయ స్థాయి ఉత్తమ పిఆర్ మేనేజర్ పురస్కారం

## సీఎండీ ఎన్. బలరామ్ అభినందనలు..






**అక్షరవేదం/గోదావరిఖని: ఆగస్టు7:** సింగరేణి సంస్థలో ముఖ్య ప్రజా సంబంధాల అధికారి, జీఎం(కో ఆర్డినేషన్) ఎస్.డి.ఎం సుభాని ప్రతిష్టాత్మక డాక్టర్ సి. వి నరసింహారెడ్డి-పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వారి జాతీయ స్థాయి ఉత్తమ పిఆర్ మేనేజర్-2025 పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ లో బుధవారం సాయంత్రం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ హాల్ లో జరిగిన నేషనల్ పబ్లిక్ రిలేషన్స్ ఎడ్యుకేషన్ డే ఉత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ఘంటా చక్రపాణి ఈ అవార్డును ఎస్.డి.ఎం.సుభాని కి ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటల్ మేనేజ్మెంట్ (నిథమ్) డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకట రమణ, పిఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అజిత్ పాఠక్, పబ్లిక్ రిలేషన్స్ వాయిస్ పత్రిక ఎడిటర్ వై బాబ్జి, పిఆర్ఎస్ఐ హైదరాబాద్ ఛాప్టర్ అధ్యక్షులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు. సింగరేణి సంస్థలోని 12 ఏరియాలలో ప్రజా సంబంధాలను పటిష్టంగా నిర్వహిస్తూ, సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ కార్మికులను చైతన్యపరచడంలో, సమాజంలో మంచి గుర్తింపు తీసుకురావడంలో ఎస్.డి.ఎం సుభాని సీపీఆర్వో హోదాలో తమదైన పాత్రను పోషించారని కొనియాడారు. ముఖ్యంగా కమ్యూనికేషన్ మాధ్యమాలైన కరపత్రాలు, పోస్టర్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్, వారం వారం సింగరేణి స్రవంతి వంటి అనేక కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తూ ద్విముఖ కమ్యూనికేషన్ ను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు గుర్తింపుగా ఈ అవార్డును సింగరేణి సీపీఆర్వో ఎస్.డి.ఎం సుభానికి బహూకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశంలో బొగ్గు పరిశ్రమల్లో సింగరేణి సంస్థ ప్రజా సంబంధాలు ఆదర్శప్రాయంగా ఉన్నాయని, ప్రజా సంబంధాల విభాగంలో గల అన్ని రకాల మాధ్యమాలను సింగరేణి పబ్లిక్ రిలేషన్స్ శాఖ సమర్థంగా వినియోగిస్తూ వస్తోందని నిర్వాహకులు కొనియాడారు. ఎస్ డి ఎం సుభానికి జాతీయ స్థాయి లో ఉత్తమ పిఆర్ మేనేజర్ అవార్డు రావడం పట్ల గురువారం సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ తన అభినందనలు తెలిపారు. ఇది సింగరేణి లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు కార్మికులకే కాకుండా ప్రజలకు తెలియజేయడంలో సింగరేణి ప్రజా సంబంధాల శాఖ చేస్తున్న కృషికి లభించిన గుర్తింపు అని ప్రశంసించారు. అంతర్జాతీయ స్థాయికి సింగరేణిని తీసుకెళ్లాలన్న లక్ష్యాలకు అనుగుణంగా కార్మికులను సన్నద్ధం చేయడంలో ప్రజా సంబంధాల విభాగం మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

# తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం: డాక్టర్ రమ్య



**అక్షర వేదం/నరసింహుల పేటఆగస్టు 07:** తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమ్య నరసింహులపేటలోని స్థానిక అంగన్వాడీ సెంటర్ సమావేశంలో తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా తల్లిపాల విశిష్టత గురించి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అర్ధగంటలోపే తల్లిపాలు పట్టించాలని ఆపాలు బిడ్డకి అన్ని రకాల వ్యాధుల నుండి రక్షణ కవచముగా తోడ్పడునని వైద్యాధికారి రమ్య అన్నారుగర్భిణీ స్త్రీలకు మరియు చిన్న పిల్లల తల్లులకి అంగన్వాడీ టీచర్లకి వైద్య సిబ్బందికి ఆయాలకు తెలియజేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ లలిత నిర్మల స్రవంతి శ్రావణి . సువాసిని. విమల. రమ ఏఎన్ఎం ప్రసన్నకుమారి కృష్ణవేణి. తోపాటుతదితరులు పాల్గొన్నారు

# మంథని గోదావరి తీరంలో ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్ధనలు




**అక్షర వేదం/మంథని,ఆగస్టు7:** మంథని పట్టణంలోని ముస్లిం మైనారిటీ సోదరులు గురువారం రోజున మంథని గోదావరి తీరంలో ప్రత్యేక నమాజు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రమంతా సంవృద్ధిగా వర్షాలు కురిసి,ప్రజలకు అల్లా దయ,కృపా కటాక్షాలు ఉండాలని కోరుతూ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.ఈ సందర్భంగా పట్టణంలోని సాలెహా మజీద్ కు చెందిన ఇమాంసాబ్ అబ్దుల్లా మాట్లాడుతూ అనంత కరుణామయుడు అల్లా దయతో ప్రకృతి కటాక్షించి సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక నమాజులు చేసినట్లు తెలిపారు. ఇలా వరుసగా మూడు రోజులు నమాజులు చేస్తామని ఆయన ప్రకటించారు. ప్రతిరోజు చేసే నమాజుకు ఈ ప్రార్ధనలు ప్రత్యేకమని వివరించారు.ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు సర్దార్ ఖాన్,మక్బూల్ ఖాన్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం మొదలై దాదాపు రెండు నెలలు దాటిన ఇంతవరకు రాష్ట్ర వ్యాప్తంగా సరైన వానలు లేక ప్రజలు అల్లాడుతున్నారని అన్నారు. వర్షాలు లేకుంటే వ్యవసాయం ముందుకు సాగక రైతులకు సరైన పంటలు పండక అవస్థలు పడే పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు. అల్లా దయతో వర్షాలు కురిసి, పంటలు పండితే ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉంటారని ప్రత్యేక ప్రార్ధనలు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మంథని పట్టణంలోని సాలెహా మజీద్ కమిటీ అధ్యక్షుడు యాకూబ్, ఆఫిజ్,ఎండీ లతీఫ్,మజీద్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అలీం ఖాన్, చాంద్, అక్బర్, శంశీర్, షాహిద్, ఐసన్, నిజాం, అంజద్, అజీమ్, హైమద్, బాబా, మోహిన్, పట్టణ ముస్లిం మైనార్టీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఈహెచ్ఎస్ ద్వారా నగదు రహిత వైద్యం అమలు కై చర్యలు తీసుకోవాలి

### చీఫ్ సెక్రటరీకి విజ్ఞప్తి చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం



**అక్షర వేదం,హైదరాబాద్:** ఈహెచ్ఎస్ ద్వారా నగదు రహిత వైద్యం అందించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సెక్రటేరియట్ లోని చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావును సంఘం రాష్ట్ర సెక్రటరీ సి చంద్రశేఖర రావు నేతృత్వంలో ప్రతినిధులు కలిసి నగదు రహిత వైద్యం అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలని, ఇతర సమస్యలపై స్పందించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ అయిన ఉద్యోగులు ఆరోగ్య సమస్యలతో అనేక ఇబ్బందులు పడుతున్నామని రిటైర్డ్ ఉద్యోగులను దృష్టిలో ఉంచుకొని నగదు రహిత వైద్యం అందించాలని కోరారు. ఆరోగ్యం సహకరించకున్న రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ కోసం సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. చీఫ్ సెక్రటరీ తో అన్ని సమస్యలను వివరించామని వారు కూడా సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కలిసిన వారిలో లక్ష్మి నరసింహారావు, వెంకట్ రెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఘనంగా బోనాల పండుగ



**అక్షర వేదం/రామన్నపేట ఆగస్టు 7:**రామన్నపేట మండలం పరిసర గ్రామాల్లో బోనాల పండుగ ఘనంగా జరిగినది రామన్నపేట మండల కేంద్రంలో బీసీ కాలనీలో బోనాల పండుగ ఘనంగా జరిగినది ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు అమ్మవారికి తమ యొక్క మొక్కులను చెల్లించినారు

# సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

### - మండల వ్యవసాయ అధికారి వీరా సింగ్

**అక్షర వేదం/మరిపెడ ఆగస్టు 07:** మరిపెడ మండలం 2025-26 సంవత్సరం గాను సబ్సిడీ పై వ్యవసాయ పనిముట్లు రైతులకు సబ్సిడీ లో కలవు దీనిలో మరిపెడ మండలానికి 26 పవర్ స్ప్రేయర్ (పెట్రోల్ పంపు )11 ట్రాక్టర్ రోటోవేటర్ మొదటి విడతగా మండలానికి కేటాంచడం జరిగింది.సబ్సిడీ వివరాలు సన్న, చిన్న కారు మరియు ఎస్టి, ఎస్సీ, జనరల్ మహిళా, రైతులకు 50% సబ్సిడీ ఇతర పెద్ద రైతులకు 40%సబ్సిడీ వర్తించును కావలసినవారు మీ వ్యవసాయా విస్తీరణ అధికారి (ఏ ఈ ఓ) వద్ద అప్లికేషన్ చేసుకో గలరు రైతు డాకుమెంట్స్అప్లికేషన్ ఫార్మ్, ఫొటోస్-పాసుపోర్టు సైజు 1.పట్టా పాసుబుక్ జిరాక్స్2.ఆధార్ కార్డు జిరాక్స్3.బ్యాంకు అకౌంట్ జిరాక్స్4.రోటోవేటర్ కి ట్రాక్టర్ రేషన్ కార్డు జిరాక్స్ తో వ్యవసాయ విస్తీరణ అధికారి కి సంప్రదించండి.

# పోలీసుల విస్తృత తనిఖీలు



**అక్షర వేదం/మంథని,ఆగస్టు7:** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణం,మండలాల్లో ఒక్కొక్కటిగా బయట పడుతున్న ఇసుక అక్రమ డంప్ యాడ్లు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పేరుతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మాఫియాకు సహకరిస్తున్నది ఎవరు. ఇప్పుడు మంథని పట్టణంలో చుట్టుపక్క గ్రామాల్లో అంతటా చర్చనీయాంశంగా మారింది.ఈ మాఫియాకు పెద్ద నాయకుల అండ దండలు ఉన్నాయా లేక అధికారుల కనుసన్నల్లోనే ఈ ఇసుక రవాణ జరుగుతుందనే ప్రశ్న తలెత్తుతుంది.మంగళవారం రోజు నాగారం గ్రామంలో 20 ట్రాక్టర్ ట్రిప్పుల అక్రమంగా ఇసుక నిలువలను గుర్తించిన పోలీసులు రెవెన్యూ అధికారులకు అప్పగించి రెండు రోజులు మరువక ముందే మళ్ళీ ఒక అక్రమంగా నిలువ ఉంచిన ఇసుక డంప్ యాడ్ కూచిరాజు పల్లి గ్రామంలో వెలుగులోకి వచ్చింది.పర్మిషన్ క్వారీతో సంబంధం లేకుండా గోదావరిలో ఇసుకను తోడేస్తున్న ఇసుక మాఫియా తోడేళ్లను అధికారులు ఎందుకు కట్టడి చేయలేకపోతున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.కూచిరాజ్ పల్లిలో ఉన్న ఇసుక డంప్ యార్డ్ ని మంథని ఎస్ఐ దేగ రమేష్ స్వాధీన పరుచుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఎవరైనా గ్రామాల్లో,పట్టణాల్లో అక్రమంగా ఇసుక తరలింపు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ ఐ హెచ్చరించిన ఇసుక మాఫియా పెడ చెవిన పెడుతూ మా పని మేం చేసుకుంటూ పోతాం అనే విధంగా అక్రమ దందాకు తెర లేపుతున్నారు. మండలంలో విస్తృత తనిఖీలు చేపట్టినట్లయితే మరిన్ని అక్రమ ఇసుక నిలువల యార్డులు బయటపడే అవకాశం లేకపోలేదని ప్రజలు భావిస్తున్నారు..

# ఎంపియుపిఎస్ పంగిడిపల్లిలో ఘనంగా రాఖీ వేడుకలు



**అక్షర వేదం ప్రతినిధి/కమలాపూర్:** ఎంపియుపిఎస్ పంగిడిపల్లి పాఠశాల యందు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు రాఖీలు కట్టుకొని సోదరా సోదరీమణుల ఆత్మీయ అనురాగాలకు ప్రతీక అయిన రాఖీ పండుగను ఘనంగా ముందస్తుగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాపగిరి శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయులు కురిమిళ్ళ సారయ్య, అలిగిరెడ్డి రాజేందర్ రెడ్డి కుమ్మరి కవిత, కత్తి రజిని వేషాల వెంకట రాజం, కందికొండ శంకర్, మాలోత్ అఖిల్ సాయి మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.



# గౌడ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక



**అక్షర వేదం/మరిపెడ ఆగస్టు 7:** గౌడ యువజన విభాగం మరిపెడ మండల కమిటీని ఎన్నిక జిల్లా గౌడ బాధ్యులు లింగాల.మహేష్ గౌడ్, గంధసిరి.కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిళ ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు బండి.దీపక్ గౌడ్ పాల్గొని మండల కమిటీని ప్రకటించారు.మరిపెడ మండల కమిటీఅధ్యక్షులు గా గుండగాని.రంగనాథ్ గౌడ్ ప్రధాన కార్యదర్శి గా గండి.భార్గవ్ గౌడ్ ఉపాధ్యక్షులు గా సోమగాని.సాయి కుమార్ గౌడ్ కార్యదర్శిగా తండ.సతీష్ గౌడ్ సహాయ కార్యదర్శి గా గాదెగాని.నరేష్ గౌడ్ కోశాధికారి గా రాంపల్లి.రంజీత్ గౌడ్ కార్యదర్శులు గా గంధసిరి.వేణు గౌడ్ ,సందీప్ గౌడ్,అశోక్ గౌడ్,అవినాష్ గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మరిపెడ పట్టణ కమిటీఅధ్యక్షులు గా గుండగాని.నరేష్ గౌడ్ ప్రధాన కార్యదర్శి గా వినోద్ గౌడ్ ఉపాధ్యక్షులు గా మహేష్ గౌడ్ కార్యదర్శి గా రాజశేఖర్ గౌడ్ ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ నాయకులు బోడపట్ల.సతీష్ రాంపల్లి.కపిల్,బోడపట్ల ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు

అక్షర వేదం
ప్రతి అక్షరం ప్రజల పక్షం | తెలుగు దిన పత్రిక



# రాజస్థాన్ రాయల్స్‌తో సంజూ శాంసన్ తెగదెంపులు



ఐపీఎల్ 2025 ముగిసినప్పటి నుంచి సంజూ శాంసన్ పేరు చర్చనీయాంశంగా మారింది. అతడు 2015 నుంచి రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న ఈ ప్లేయర్.. వచ్చే సీజన్‌లో కొత్త జెర్సీలో కనిపించనున్నాడి ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా అతడు చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి చేరతాడని వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా మరో విషయం వెలుగులోకి వచ్చింది. తనను జట్టు నుంచి రిలీజ్ చేయాలని సంజూ శాంసన్‌ను రాజస్థాన్ రాయల్స్‌ను కోరినట్లు క్రిక్‌బజ్ నివేదించింది. దీంతో అతడికి, రాజస్థాన్‌కు మధ్య తీవ్రమైన విభేధాలు తలెత్తినట్లు స్పష్టమవుతోంది. ఐపీఎల్ 2025 సందర్భంగా రాజస్థాన్ రాయల్స్, సంజూ శాంసన్ మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు నుంచి వచ్చిన తర్వాత 2015లో సంజూ.. రాజస్థాన్ రాయల్స్‌లో చేరాడు. అప్పటి నుంచి ఇదే జట్టులో కొనసాగుతున్నాడు. టీనేజ్ ప్లేయర్‌గా జట్టులోకి వచ్చిన అతడు.. కెప్టెన్ అయ్యాడు. కానీ గత సీజన్‌లో మేనేజ్‌మంట్ తీరుపట్ల అతడు హర్ట్ అయినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఓపెనింగ్ ప్లేస్ విషయంలోనూ వివాదాలు తలెత్తినట్లు సమాచారం. వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైశ్వాల్‌లు ఓపెనర్‌లుగా సెట్ కావడంతో సంజూ వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు రావాల్సి వచ్చింది. ఇదే అతడు హర్ట్ అయ్యేందుకు కారణమా అంటే స్పష్టత లేదు. ఇక హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో సైతం అతడికి పొసగడం లేదని సమాచారం. కొన్ని రోజులుగా సంజూ శాంసన్.. సీఎస్కే మధ్య చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. సంజూ ఫ్యామిలీ అయితే ఏకంగా వచ్చే సీజన్‌లో అతడు రాజస్థాన్ రాయల్స్‌తో ఆడబోడని చెప్పేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తనను రిలీజ్ చేయలని అతడు రాజస్థాన్ రాయల్స్‌ను కోరినట్లు తెలుస్తోంది. అయితే ఐపీఎల్ 2025 వేలానికి ముందు రాజస్థాన్ రాయల్స్ రూ.18 కోట్లకు సంజూను రిటైన్ చేసుకుంది. 2027 సీజన్ వరకు ఈ ఒప్పందం కొనసాగుతోంది. ఒకవేళ అగ్రిమెంట్ బ్రేక్ చేయాలంటే ఫ్రాంఛైజీ అంగీకారం తప్పనిసరి. సంజూనే జట్టును వీడాలని భావిస్తున్నందున.. ప్రస్తుతం ఉన్న అవకాశాలపై ఆ ఫ్రాంఛైజీ దృష్టిసారించింది! ఇందులో భాగంగా సీఎస్కే సహా పలు ఇతర ఫ్రాంఛైజీలతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. అయితే కేవలం వన్ వే ట్రేడ్ ద్వారా సంజూను ఇచ్చేందుకు రాజస్థాన్ ఆసక్తి చూపించడం లేదట. బదులుగా ఆటగాడిని రీప్లేస్ చేయాలని చూస్తోందట. అందుకే డీల్ ఆలస్యం అవుతోందని సమాచారం. మరి సంజూ విషయంలో రాజస్థాన్ రాయల్స్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది తేలాల్సి ఉంది.

# భారత్‌కు బుమ్రా ఎన్నో గొప్ప విజయాలను అందించాడు

**● బుమ్రా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌పై ట్రోలింగ్ : హర్షా భోగ్లే**

వరల్డ్ నెంబర్ వన్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా పై నెట్టింట ట్రోలింగ్ జరుగుతోంది. ముఖ్యంగా అండర్సన్ - టెండూల్కర్ ట్రోఫీలో బుమ్రా రెండు మ్యాచ్‌లకు రెస్ట్ తీసుకోవడంపై నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. దానికి తోడు ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో బుమ్రా ఆడిన మూడు టెస్టుల్లో భారత్ రెండు ఓడిపోయింది. ఒకదాంట్లో ఫలితం రాలేదు. బుమ్రా రెస్ట్ తీసుకున్న రెండు టెస్టుల్లోనూ టీమిండియా విజయం సాధించింది. ఇదే విషయమై సోషల్ మీడియాలో కొందరు బుమ్రాని టార్గెట్ చేస్తూ వచ్చారు. దాంతో కామెంటేటర్ హర్షా భోగ్లే నెటిజన్లపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. భారత క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ పేసర్లలో బుమ్రా ఒకడని, ఇలాంటి విమర్శలు అన్నీ దాటుకుని వచ్చాడని హర్షా గుర్తు చేశాడు. అలాంటి ఆటగాడిని ట్రోల్ చేయడం అంటే అజ్ఞానమే అంటూ గట్టిగా వాయించేశాడు. అభినందించకపోయినా ఇలా చేయడం కరెక్ట్ కాదన్నాడు."నిజంగా? బుమ్రాని ట్రోల్ చేస్తున్నావా? నువ్వు వాళ్లల్లో ఒకడివి కాకపోతే మంచిదే. అయితే వాళ్లలో ఒకడివే అయితే.. బుమ్రా అవడానికి ఎంత కష్టాన్ని, త్యాగాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందో నీకు ఎలాంటి అవగాహన లేదని చెప్పొచ్చు. ఇంకా.. అతను ఎంత గొప్ప మ్యాచ్ విన్నరో నీకు అర్థం కానట్టే. అతను భారతదేశానికి అత్యుత్తమ విజయాలు అందించిన బౌలర్లలో ఒకడు. నిజానికి మిగతా బౌలర్ల కన్నా దాదాపు ఎక్కువ ఓవర్లే వేశాడు" అంటూ ఎక్స్ వేదికగా హర్షా భోగ్లే పోస్ట్ చేశాడు. హర్షా భోగ్లే పోస్ట్ కింద ఓ నెటిజన్ రిప్లయ్ ఇచ్చాడు. మేమేమీ ట్రోల్ చేయడం లేదు. వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్ గురించి మాత్రమే ప్రశ్నిస్తున్నాము. అది కూడా తప్పనే అంటారా? అని ప్రశ్నించాడు. దానికి హర్షా రిప్లయ్ ఇస్తూ.. 'కాదు, అది మంచిదే. అయితే గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే.. ప్రతీ శరీరం వేరుగా ఉంటుంది. అన్ని సమస్యలకు ఒకటే పరిష్కారం చూపలేము కదా' అని రిప్లయ్ ఇచ్చాడు. అండర్సన్ - టెండూల్కర్ ట్రోఫీలో జస్ప్రీత్ బుమ్రా మూడు మ్యాచ్ లలో ఐదు ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఈ సిరీస్‌లో 119.4 ఓవర్లు వేసిన బుమ్రా 14 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లండ్ - ఇండియా సిరీస్‌లో మహమ్మద్ సిరాజ్ 23 వికెట్లతో టాప్ బౌలర్‌గా నిలవగా.. జోష్ టంగ్ 19 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. బెన్ స్టోక్స్ 17 వికెట్లు పడగొట్టగా, బుమ్రా 14 వికెట్లతో నిలిచాడు.




# బహుమతి తీసుకోవడానికి సిరాజ్ ఎందుకు నిరాకరించాడు!

భారత్ ఇంగ్లాండ్‌పై ఓవల్ టెస్ట్‌లో 6 పరుగుల తేడాతో సాధించిన ఉత్కంఠభరిత విజయం టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఐదో రోజున మహ్మద్ సిరాజ్ వేసిన డేంజరస్ బౌలింగ్‌తో ఇంగ్లాండ్‌ను 367 పరుగులకు భారత్ ఆలౌట్ చేసింది. సిరాజ్ ఆ మ్యాచ్‌లో మొత్తం 9 వికెట్లు తీశాడు, దీని కారణంగా అతనికి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. మ్యాచ్ తర్వాత ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డ్ అవార్డు విజేతలకు బహుమతులు అందించింది, అయితే సిరాజ్ ఆ బహుమతిని తీసుకోలేదు. ఓవల్ టెస్ట్ తర్వాత మహ్మద్ సిరాజ్‌ను ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపిక చేశారు. గౌతమ్ గంభీర్, బ్రెండన్ మెకల్లమ్ వరుసగా హ్యారీ బ్రూక్, శుభ్‌మన్ గిల్ లను ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా ఎంపిక చేశారు. ఈ అవార్డు విజేతలకు మ్యాచ్ తర్వాత షాంపైన్ బాటిల్‌ను బహుమతిగా ఇచ్చింది, అయితే మహ్మద్ సిరాజ్ దానిని తీసుకోలేదు. మరోవైపు, శుభ్‌మన్ గిల్ షాంపైన్ బాటిల్‌ను స్వీకరించాడు, కాని సిరాజ్‌కు గౌరవంగా అతను బాటిల్‌ను ఓపెన్ చేయలేదు. మహ్మద్ సిరాజ్ షాంపైన్ బాటిల్‌ను తీసుకోలేదు, ఎందుకంటే ఇస్లాంలో మద్యం సేవించడం హరామ్ (నిషిద్ధం). ఈ సంవత్సరం ఐపీఎల్2025 ప్రారంభానికి ముందు సిరాజ్ హజ్



యాత్రకు కూడా వెళ్ళిన సంగతి తెలిసిందే. మహ్మద్ సిరాజ్, భారత్ %జం% ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌లో అత్యధిక ఓవర్లు వేసి అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. అతను సిరీస్‌లోని ఐదు మ్యాచ్‌లలో మొత్తం 185.3 ఓవర్లు బౌలింగ్ చేశాడు, అదే సమయంలో అతను 23 వికెట్లు తీశాడు. ఇన్ని ఓవర్లు, నెట్స్‌లో ప్రాక్టీస్, చాలా రోజుల ఫీల్డింగ్ తర్వాత సిరాజ్ మాత్రమే కాదు, ఏ ఆటగాడి శరీరమైనా అలసిపోతుంది. అయినప్పటికీ, అతను ఓవల్ టెస్ట్‌లో ఐదో రోజున గంటకు 143 కిమీ వేగంతో బంతిని విసిరి అట్కిన్సన్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ ముగిసిన తర్వాత, ఐసిసి తన తాజా టెస్ట్ ర్యాంక్‌లను విడుదల చేసింది. జస్ప్రీత్ బుమ్రా ప్రపంచ టాప్ ర్యాంక్ టెస్ట్ బౌలర్‌గా ఆధిపత్యం చెలాయించగా, ఇంగ్లాండ్‌కు చెందిన గస్ అట్కిన్సన్, భారతదేశానికి చెందిన మొహమ్మద్ సిరాజ్ గణనీయమైన పురోగతి సాధించారు. ఓవల్ అద్భుత ప్రదర్శన తర్వాత సిరాజ్ ర్యాంక్స్‌లో దూసుకుపోయాడు. కెన్నింగ్టన్ ఓవల్ టెస్ట్‌లో తొమ్మిది వికెట్లు తీసిన మొహమ్మద్ సిరాజ్ అద్భుతమైన ప్రదర్శనతో అతను 12 స్థానాలు పైకి ఎగబాకాడు. 27వ ర్యాంక్ నుంచి, భారత పేసర్ ఇప్పుడు ప్రపంచంలో 15వ స్థానంలో ఉన్నాడు. %×జజ% టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అతని కెరీర్ అత్యుత్తమ స్థానం. రవీంద్ర జడేజా మూడు స్థానాలు దిగజారాడు. ఇప్పుడు అతను 14వ స్థానం నుంచి 17వ స్థానానికి తగ్గాడు. ప్రసిద్ధ్ కృష్ణ భారీ పురోగతి సాధించి 25 స్థానాలు ఎగబాకి 59వ స్థానానికి చేరుకున్నాడు. ఆకాశ్ దీప్, వాషింగ్టన్ సుందర్ ఇద్దరూ ఆరు స్థానాలు దిగజారారు.




# అంకిత్ కుమార్ తుఫాను బ్యాటింగ్‌తో విధ్వంసం

ఢిల్లీ ప్రీమియర్ లీగ్ 2025 ప్రారంభమైంది. దీంతో కొంతమంది ఐపీఎల్ స్టార్లు ఈ లీగ్‌లో తమ సత్తా చాటుతున్నారు. ప్రస్తుతం లీగ్‌లో 7వ మ్యాచ్ గత రాత్రి జరిగింది. ఇందులో వెస్ట్ ఢిల్లీ బ్యాటర్ అంకిత్ కుమార్ సౌత్ ఢిల్లీ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తన తుఫాను బ్యాటింగ్‌తో విధ్వంసం సృష్టించాడు. ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వెస్ట్ ఢిల్లీ లయన్స్ తరపున ఆడే అంకిత్ కుమార్ తన విధ్వంసక బ్యాటింగ్‌తో మ్యాచ్ ఉత్కంఠను తారా స్థాయికి చేర్చాడు. సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్‌తో జరిగిన మ్యాచ్‌లో, అంకిత్ 46 బంతుల్లో 96 పరుగులు చేసి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చాడు. తన తుఫాన్ ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 7 సిక్సర్లు బాదేశాడు. అంకిత్ విధ్వంసక బ్యాటింగ్ ఫలితంగా వెస్ట్ ఢిల్లీ జట్టు 15.4 ఓవర్లలో 186 పరుగుల లక్ష్యాన్ని చేరుకుంది. అంకిత్ తన బ్యాటింగ్‌తో విధ్వంసం సృష్టించడమే కాదు.. ఐపీఎల్ ఫేమ్ దిగ్వేష్ రతితో మైదానంలో అతని వాగ్వాదం మ్యాచ్ వాతావరణాన్ని మరింత హీటెక్కించింది. ఈ సమయంలో, ఇద్దరి మధ్య కొంత వాగ్వాదం జరిగింది. అయితే, త్వరగానే గొడవ సద్దుమణిగింది. ఈ మ్యాచ్‌లో దిగ్వేష్ రతి చాలా ఖరీదైనవాడిగా నిరూపితమయ్యాడు. అతను కేవలం 2 ఓవర్లలో 29 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అంకిత్ కుమార్‌తో పాటు, క్రిష్ యాదవ్ కూడా వెస్ట్ ఢిల్లీ తరపున అద్భుతంగా రాణించాడు. వికెట్ కీపర్ బ్యాట్స్ మాన్ క్రిష్ 42 బంతుల్లో 67 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్ లో అతను 9 ఫోర్లు, 2 సిక్సర్లు కొట్టాడు. ఈ విధంగా, అంకిత్‌తో కలిసి, క్రిష్ మొదటి వికెట్‌కు 158 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ మ్యాచ్ గురించి మాట్లాడితే, సౌత్ ఢిల్లీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసింది. సౌత్ ఢిల్లీ తరపున కున్వర్ బిధురి, కెప్టెన్ ఆయుష్ బదోని ఆకట్టుకున్నారు. మిగతా ప్లేయర్లు ఆకట్టుకోలేకపోయారు. ఈ కారణంగానే ఆ జట్టు 200 పరుగుల కంటే తక్కువ స్కోరుకే పరిమితమైంది. దీని కారణంగా స్టార్లతో నిండిన సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్స్ జట్టు ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది.

# ఆర్టీఐ-2005 నుంచి బీసీసీఐకి మినహాయింపు

**● భారత క్రికెట్ నియంత్రణ మండలికి భారీ ఊరట**




భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)కి భారీ ఊరట లభించింది. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ)-2005 నుంచి బీసీసీఐకి మినహాయింపు ఇచ్చింది. ఇటీవల బీసీసీఐని ప్రభుత్వ పరిధిలోకి తెస్తూ నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లును కేంద్రం రూపొందించిన విషయం తెలిసిందే. ఈ బిల్లు ప్రకారం దేశంలో గుర్తింపు పొందిన ఏ క్రీడా సంఘమైనా ప్రజలకు చెందినదేనని, తమ విధులు, అధికారాలు నిర్వహించే విషయంలో సమాచారా హక్కు చట్టం(ఆర్టీఐ)-2005 పరిధిలోకి అది వస్తుందని అందులో పేర్కొంది. అయితే దీనిపై బీసీసీఐ అభ్యంతరం తెలిపింది. ఇతర క్రీడా సంఘాల తరహాలో తాము ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహకారం తీసుకోవడం లేదని, బోర్డు ఆర్టీఐ పరిధిలోకి తీసుకురావద్దని పలుమార్లు విజ్ఞప్తి చేసింది. చివరకు బోర్డు ఆశించిన ప్రకారం వారికి ఊరట కలిగించేలా ప్రభుత్వం కొత్త బిల్లులో సవరణను జోడించింది. సవరించిన బిల్లు ప్రకారం ప్రభుత్వం నుంచి నిధులు, సాయం పొందే క్రీడా సంఘాలు మాత్రమే ఆర్టీఐ పరిధిలోకి వచ్చేలా మార్పులు చేసింది. తాజా సవరణతో ఆర్టీఐ ద్వారా బీసీసీఐని ప్రశ్నించే అధికారం సామన్య ప్రజలకు లేకుండా పోయింది. 'తాజా స్పోర్ట్స్ బిల్లులో బీసీసీఐ అంశం ఒక సమస్యగా కనిపించింది. ఆర్థిక సహకారం తీసుకోవడం లేదనే కారణం చూపించి ఈ బిల్లు ఆమోదం పొందకుండా పార్లమెంట్‌లో అడ్డుకునే అవకాశం ఉండేది. లేదా ఇదే కారణంతో బీసీసీఐ కోర్టుకెక్కేది కూడా. అందుకే సవరణ చేయాల్సి వచ్చింది.'అని కేంద్ర క్రీడా శాఖ ఉన్నతాధికారి ఒకరు మీడియాకు తెలిపారు. ఆర్టీఐ నుంచి మినహాయింపు లభించినా.. కొన్ని ఇతర నిబంధనలు బీసీసీఐని ప్రభుత్వం ప్రశ్నించేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొంది చట్టంగా మారితే బీసీసీఐ కూడా వెంటనే జాతీయ క్రీడా సమాఖ్యగా కొత్త రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. 2028 నుంచి క్రికెట్ కూడా ఒలింపిక్ క్రీడగా మారనుండటం దీనికి ఒక కారణం. కొత్త బిల్లు ప్రకారం నిధులు పొందకపోయినా.. వ్యవస్థ నడిచేందుకు ఇతర రూపాల్లో సహాయ సహకారాలు తీసుకుంటుంది కాబట్టి జవాబుదారీతనం ఉండాల్సిందే. బీసీసీఐ నేషనల్ స్పోర్ట్స్ ట్రెబ్యునల్ పరిధిలోకి రావడం వల్ల వివాదాలు ఏర్పడితే ఎన్ఎస్‌టీ పరిష్కరిస్తుంది. ట్రెబ్యునల్ తీర్పులను సుప్రీం కోర్టులో మాత్రమే సవాల్ చేయాల్సి ఉంటుంది.



# టీమిండియాకు అదృష్టంగా మారిన ధృవ్ జురెల్

యువ జట్టుతో ఇంగ్లాండ్‌లో పర్యటించిన టీమిండియా సిరీస్‌ను గెలవలేకపోయింది. కానీ వారి స్వంత గడ్డపై 2 మ్యాచ్‌ల్లో ఇంగ్లీష్ జట్టును ఓడించగలిగింది. శుభ్‌మాన్ గిల్ కెప్టెన్సీలో యువ భారత జట్టు ఇంగ్లాండ్‌పై అద్భుతమైన ప్రదర్శన చేసింది. సిరీస్‌ను 2-2తో సమం చేసింది. ఈ సిరీస్‌లోని చివరి మ్యాచ్‌లో ఓ ప్లేయర్‌కు ఆడే అవకాశం లభించడం టీమిండియా అదృష్టమని మరోసారి నిరూపితమైంది. టీమిండియా యొక్క ఆ అదృష్ట ఆటగాడి పేరు ధృవ్ జురెల్. తన వికెట్ కీపింగ్, బ్యాటింగ్‌తో టీమిండియాలో స్థానం సంపాదించడానికి ప్రయత్నిస్తున్న ధృవ్, టీమ్‌కే అదృష్టవంతుడిగా మారుతున్నాడు. జురెల్ తన టెస్ట్ కెరీర్‌లో ఇప్పటివరకు ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. ఆశ్చర్యకరంగా.. భారత్ ఈ మ్యాచ్‌లన్నింటినీ గెలుచుకుంది. అంటే, ధ్రువ్ జురెల్ తన టెస్ట్ కెరీర్‌లో ఇంకా ఒక్క ఓటమి కూడా చవిచూడలేదు. నిజానికి.. టెస్ట్ క్రికెట్ చరిత్రలో, ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అత్యధిక టెస్ట్ మ్యాచ్‌లను గెలిచిన రికార్డు వెస్టిండీస్ మాజీ ఆల్ రౌండర్ ఆల్డిన్ బాప్టిస్ట్ పేరు మీద ఉంది. బాప్టిస్ట్ తన టెస్ట్ కెరీర్‌లో వరుసగా 10 టెస్ట్ మ్యాచ్‌లు ఆడితే అన్నింటిలో టీమ్ గెలిపొందింది. అతను తన కెరీర్ చివరి వరకు ఒక్క టెస్ట్ మ్యాచ్ కూడా ఓడిపోలేదు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ యువ వికెట్ కీపర్ కమ్ బ్యాట్స్‌మన్ 2024లో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ కెరీర్‌లో అరంగ్రేటం చేశాడు.



# శ్రీలీలతో నిర్మాతలకు భరోసా

## హీరోయిన్‌గా, డ్యాన్సర్‌గా డ్యూయల్ రోల్

శ్రీలీల ఉంటే ఇక ఆ సినిమాలో స్పెషల్ సాంగ్స్ కోసం మరో భామను వెతకాల్సిన పని లేదు. ఎందుకంటే హీరోయిన్ రోల్‌కే కాదు ఐటమ్ నెంబర్‌కు ఫర్ ఫెక్ట్ ఛాయిస్‌గా మారిపోయింది. డ్యూయెట్ సాంగైనా, ఊర మాస్ పాటైనా మేడమ్ రచ్చ రంబోలా చేయాల్సిందే. స్పెషల్ సాంగ్ కోసం స్టార్ హీరోయిన్లకు నిర్మాతలు కోట్లు వెచ్చించి తెచ్చుకునే ఛాన్స్ లేకుండా కిసిక్ బ్యూటీ డ్యూయల్ రోల్ పోషించేస్తోంది. ధమాకాలో పల్సర్ బైక్, జింతాకా అంటూ మాసీ స్టెప్పులు మొదలెట్టిన దగ్గర నుండి డ్యాన్సింగ్ క్వీన్‌గా ముద్రపడిపోయింది శ్రీలీల. ఫీమేల్ లీడ్‌గా నటిస్తే మాస్ సాంగ్ కంపల్సరీ. ఇక ఐటమ్ నంబర్ కోసం మరో భామకు తెచ్చుకోనక్కర్లేదు. ఏ టు- జెడ్ ఫెర్మామెన్స్ ఇచ్చేస్తుంది కిస్సిక్ బ్యూటీ-. యూట్యూబ్‌ను షేక్ చేయాలంటే మిస్ లీల ఉంటే చాలనేంతలా ప్రొడ్యూసర్ల మైండ్లలో ఫిక్స్ అయ్యేలా చేసింది. సినిమాపై హైప్ రావాలా, అ-టె-న్షన్ కావాలా వైరల్ వయ్యారీతో డ్యాన్స్ చేస్తే పోలా అని భావిస్తున్నారు. గుంటూరు కారంలో కుర్చీ మడత పెట్టినా, జూనియర్‌లో వైరల్ వయ్యారీగా మారినా తాను హీరోయిన్ కాని పుష్ప2లో కూడా కిస్సిక్ బ్యూటీ-గా ర్యాంపేజ్ గ్లామర్ షోతో మాస్ మహారాణిగా మారిపోయింది. ఇటు- హీరోయిన్‌గా, ఇటు- ఐటమ్ గర్ల్ గా మూవీకి వన్ ఉమెన్ షోగా మేకోవరైంది శ్రీలీల. అంటే నిర్మాతలకు డబుల్ బోనాంజాలా మారిన మేడమ్.. నెక్స్ట్ రవితేజ మూవీ మాస్ జాతరలోనూ అటు- క్లాసీ లుక్, ఇటు- మాసీ సాంగ్స్‌లో గత్తర లేపడానికి రెడీ అయ్యింది. మరోసారి ఈ జోడీ బాక్సాఫీస్ దగ్గర ధమాకా హిట్ నమోదు చేస్తుందా ఎలాపుల్లో ఉన్న రవితేజ, శ్రీలీలకు కంబ్యాక్ మూవీగా మారుతుందో లేదో చూడాలి.



# సినీ కార్మికుల సమ్మె..

# చిన్ననిర్మాతల భేటీ

టాలీవుడ్ లో గత ఐదు రోజులుగా షూటింగ్స్ లేక మూగబోయింది. వేతనాల పెంపుపు పై కార్మిక సంఘాలకు, ఫిల్మ్ ఛాంబర్ కు మధ్య మొదలైన వివాదం బంద్ కు దారి తీసింది. ఈ విషయమై గురువారం పలువురు చిన్న సినిమా నిర్మాతలతో ఫిల్మ్ ఛాంబర్ సభ్యులు సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సీ. కళ్యాణ్ మాట్లాడుతూ చిన్న సినిమాల నిర్మాతలతో సమావేశం నిర్వహించాము. చిన్న నిర్మాతలు మార్కెటింగ్ లేక థియేటర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్న సినిమాల వల్లే కార్మికుల మనుగడ ఉంది. ఇప్పటి వరకు తీసుకున్న జీతం కంటే 25శాతం జీతాలు తక్కువ తీసుకోవాలని నిర్మాతలు డిమాండ్ చేశారు. మేము ఒక్క పైసా పెంచమని నిర్మాతలు చెప్పారు. ఎవరితో అయినా సినిమాలు తీసుకుంటామని చెబుతున్నారు. ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఏం నిర్మాణం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటామని చెప్పారు.రూ. 4 నుండి 5 కోట్లు- చిన్న సినిమాకు ఖర్చు అవుతుంది. చిన్న సినిమా నిర్మాతలు ఇప్పటి నుంచి ఎవరితో అయినా సినిమాలు చేసుకోవచ్చు. ప్రొడ్యూసర్స్ మీద దాడి చేస్తే తాట తీస్తాం.పెద్ద హీరోలకు నిర్మాతలు తమ బాధలు చెప్పుకున్నారు. కార్మికులు గొంతెమ్మ కోరికలు విడనాడాలి. రెండు రోజుల్లో సమ్మె ముగుస్తుందని భావిస్తున్నా...నిన్ననే దిల్ రాజుతో మాట్లడను మళ్ళీ ఎప్పుడు కబురు పంపినా మాట్లాడడానికి మేము సిద్ధం అన్నారు.

నిర్మాత చదలవాడ శ్రీనివాస్ మాట్లాడుతూ చాంబర్, కౌన్సిల్ మాత్రమే ఈ సమస్య పై మాట్లాడే అధికారం ఉంది.తొందరలోనే సమ్మె ముగుస్తుందని ఆశిస్తున్నాం. ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల కంటే తెలుగు రాష్ట్రాల్లో జీతాలు ఎక్కువగా ఇస్తున్నాం. చిన్న సినిమా బ్రతికితేనే సినిమా బ్రతుకుతుంది.98 శాతం ఫెల్యూర్ ఉంది. నిర్మాత చనిపోతూ కార్మికులను బ్రతికిస్తున్నాడు. అసలు ఇస్తున్న రెమ్యునరేషన్ ను 25 శాతం తగ్గించి ఇవ్వాలని అనుకున్నాం. కానీ స్టార్ హిరోలతో తీయని సినిమా ఏదైనా చిన్న సినిమానే. నిర్మాతలు కోమాలో ఉన్నారు. ఆక్సిజన్ తీసేసి మమ్మల్ని చంపేయవద్దు.




ఈ సమస్య ఛాంబర్ లోనే పరిష్కరించుకుంటాం. ఇతరుల ప్రమేయం అవసరం లేదు. అందరం ఒకే కుటుంబ సభ్యులమని అన్నారు.

# ప్రభాస్ స్పిరిట్ కోసం ఆఫర్

## • నటించాలనుకునే యువతకు ఛాన్స్


అగ్ర కథానాయకుడు ప్రభాస్, దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. 'స్పిరిట్' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రం దాదాపు రూ. 300 కోట్ల బడ్జెట్‌తో రాబోతుండగా.. ఈ మూవీని టీ- సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రోడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం సెప్టెంబర్ చివరిలో షూటింగ్ ప్రారంభించనుంది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీకి సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను వెల్లడించింది చిత్రబృందం. ప్రభాస్ స్పిరిట్ సినిమాలో నటించేందుకు ఆసక్తి ఉన్న వారిని డిజిటల్ ఆడిషన్స్‌కి పిలుస్తుంది చిత్రయూనిట్. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేసింది భద్రకాళీ పిక్చర్స్. ప్రభాస్ స్పిరిట్ సినిమాలో నటించేందుకు 13 నుంచి 17 ఏండ్ల వయసున్న పురుష నటులను ఆడిషన్స్‌లో పాల్గొనవచ్చని తెలిపింది. అయితే ఆడిషన్స్‌లో పాల్గొనేవారు పాత్ర కోసం తమ జుట్టు- కత్తిరించుకోవడానికి కూడా సిద్ధంగా ఉండాలని తెలిపింది. అలాగే ఒక హెడ్ షాట్ ఫోటోతో పాటు- పర్సనల్ షాట్ ఫోటో కూడా జత చేయాలని కోరారు. ఇక ఇంట్రడక్షన్ వీడియోలో మీ పేరు ఇతర వివరాలు వెల్లడించడంతోపాటు మీ చదువుకు సంబంధించిన వివరాలు కూడా వెల్లడించాలని కోరారు.

# అర్జున్ చక్రవర్తి నుంచి మేఘం వర్షించదా పాట




టాలీవుడ్ యువ నటుడు విజయ రామరాజు టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం'అర్జున్ చక్రవర్తి'. ఇప్పటికే పలు అంతర్జాతీయ చలనచిత్ర వేదికలలో 46కి పైగా అవార్డులు గెలుచుకున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ 'మేఘం వర్షించదా' అనే పాటను విడుదల చేశారు. విఘ్నేష్ బాస్కరన్ ఈ అందమైన ప్రేమ గీతాన్ని కంపోజ్ చేయగా.. విక్రాంత్ రుద్ర రాసిన సాహిత్యం మనసును హత్తుకునేలా ఉంది. కపిల్ కపిలన్, మీరా ప్రకాష్, సుజిత్ శ్రీధర్ తమ మ్యాజికల్ వాయిస్‌తో ఆకట్టు-కున్నారు. ఈ పాటలో విజయరామరాజు, సిజా రోజ్ కెమిస్ట్రీ ఆకట్టు-కునేలా ఉంది. అద్భుతమైన స్పోర్ట్స్ డ్రామాతో పాటు- హార్ట్ టచింగ్ లవ్ స్టోరీతో 'అర్జున్ చక్రవర్తి' అలరించ బోతుందని ఈ పాట తెలియజేస్తుంది. విజయ రామరాజు, సిజా రోజ్, హర్ష్ రోషన్, అజయ్, అజయ్ ఘోష్, దయానంద్ రెడ్డి, దుర్గేష్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాకి శ్రీని గుబ్బల నిర్మాతగా, ఈడే కృష్ణ చైతన్య సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రానికి విఘ్నేష్ బాస్కరన్ సంగీతం అందించగా, జగదీష్ చీకాటి సినిమాటోగ్రఫీ, ప్రదీప్ నందన్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. ఈ సినిమాకు కృష్ణకాంత్ సాహిత్యం, రవీంద్ర పుల్లె సంభాషణలు రాశారు. పూజిత తాడికొండ కాస్ట్యూమ్ డిజైనర్‌గా, విష్ణు వర్ధన్ కలర్స్ ని అందించారు. పబ్లిసిటీ- డిజైన్ స్కేల్ టిల్ట్ స్టూడియోస్, విఎఫ్ఎక్స్ మ్యాడ్‌హౌస్ విఎఫ్ఎక్స్ చేయగా, తేజస్వి సజ్జా పిఆర్‌ఓ గా వ్యవహరించారు, హాష్‌ట్యాగ్ మీడియా మార్కెటింగ్ బాధ్యతలు చూసుకుంది.

# మణిరత్నం మరో లవ్‌స్టోరీ



## యువహీరో ధ్రువ్ విక్రమ్‌తో మూవీ

ప్రముఖ దర్శకుడు మణిరత్నం పేరు వినగానే అందరికీ గుర్తొచ్చేది హృదయాలను తాకే అందమైన ప్రేమ కథలు. అయితే ఇటీవల ఆయన దర్శకత్వంలో వచ్చిన 'థగ్‌లైఫ్' చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయింది. ఈ సినిమా ఫలితంగా కొంత నిరాశకు లోనైన మణిరత్నం, తన ఫేవరెట్ జోనర్ అయిన లవ్ డ్రామా వైపు మళ్లీ రీటర్న్ అవ్వడానికి సిద్ధమవుతున్నారు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఆయన కొత్తగా తెరకెక్కించబోయే చిత్రంలో తమిళ యువ హీరో ధ్రువ్ విక్రమ్, కన్నడ బ్యూటీ- రుక్మిణి వసంత్ హీరో హీరోయిన్లుగా నటించనున్నారు. తొలిసారి స్క్రీన్ పై కలసి నటించనున్న ఈ జంట సినిమాకు హైలైట్‌గా నిలవనుందని భావిస్తున్నారు.ప్రేమ, కుటుంబ సంబంధాలు, వ్యక్తిగత సంఘర్షణలు అన్నీ కలగలిపిన ఒక భావోద్వేగ భరితమైన కథతో మణిరత్నం ఈ సినిమాను రూపొందించనున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. నవంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు ఎలాన్ చేస్తున్నారు. ఈ సినిమాకు సంగీతం అందించనున్న ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ మరో స్పెషల్ అట్రాక్షన్ కానుంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశముంది. మణిరత్నం గత సినిమాలకన్నా పూర్తి భిన్నంగా, కొత్త ఎనర్జీతో ఈ సినిమాను తెరకెక్కించనున్నారని తెలిసింది. కథలోని పాత్రలు, వారి మధ్య ఉన్న బంధాలు ప్రేక్షకులకు కొత్తగా అనిపించేలా మణిరత్నం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఫిలింనగర్ వర్గాలు చెబుతున్నాయి. సుదీర్ఘ విరామం తర్వాత మణిరత్నం మళ్లీ ఓ క్లాస్ లవ్ స్టోరీతో వెండితెరపై సందడి చేయబోతుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి.